ప్రజాశక్తి

సోమవారం 23 సెప్టెంబర్ 2024

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

రుషికొండ... గుదిబండేనా!

☛ కూటమి ప్రభుత్వం పక్కనపెట్టేసినట్టేనా?

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖలోని రుషికొండపై గత ప్రభుత్వ హయాంలో అక్షరాలా రూ.415కోట్ల మేర ప్రజాధనాన్ని వెచ్చించి సాగర తీరానికి అభిముఖంగా నిర్మాణం చేసిన 7 భవనాలు రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వానికి గుదిబండగా మారాయా? అంటే అవుననే సమాధానం వస్తోంది. రుషికొండపై పర్యావరణాన్ని ధ్వంసం చేసి నిర్మాణాలు సాగుతున్నాయంటూ రాజకీయంగా కూటమి నేతలు గత ఎన్నికల సమయంలో విమర్శలు చేసిన సంగతి తెలిసిందే. కూటమి ప్రభుత్వం 2024 ఎన్నికల్లో అధికారం చేపట్టాక స్థానిక భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఈ ఏడాది జూన్ 16న రుషికొండపైకి మీడియాను తీసుకెళ్లి భవన నిర్మాణాలను ఎంత విలాసవంతంగా జగన్ నిర్మించాడో అన్న అంశాన్ని చూపించారు. త్వరలోనే దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ స్వయంగా పర్యటించి ఏం చేయాలో నిర్ణయం తీసుకుంటారని వెల్లడించిన సంగతి తెలిసిందే. ఇటు గుండా రాకపోకలు సాగించే ప్రజలు, వాహనదారులు మాత్రం రుషికొండ భవనాలను చూసుకుంటూ వాహనాలను నెమ్మదిగా పోనిస్తూ చర్చించుకోవడం నిత్యకృత్యంగా మారింది. 2019 ఎన్నికల్లో రాష్ట్రంలో గెలిచిన వైసిపి ప్రభుత్వం ముఖ్యమంత్రి జగన్ విశాఖను గత పరిపాలనా రాజధాని చేయాలన్న విధానం ప్రకటించాక ఈ భవనాలను విలాసవంతంగా నిర్మించడం, వీటి నిర్మాణాలు జరిగే క్రమం సైతం అత్యంత రహస్యంగా సాగిన క్రమంలో మూడేళ్ల పాటు ప్రజలు రుషికొండపై పర్యటనలకు నోచుకోలేకపోయారు. గత ప్రభుత్వంలో గల యథాతథ స్థితే నేడూ కొనసాగుతోంది.

తాజా ప్రభుత్వం కనీసం కమిటీ అయినా నియమిస్తుందా?

ప్రస్తుతం రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈ రుషికొండపై దృష్టిసారించే పరిస్థితులు కనిపిస్తున్నాయా? అన్నది అనుమానాస్పదమే. ఈ 7 భవనాల నిర్వహణకు నెలవారీగానే కరెంట్ బిల్లులు, వ్యక్తుల పహారా వంటివాటికి పెద్ద ఎత్తున వ్యయం కానుందన్నది ప్రభుత్వం భావిస్తోంది. ఈ నేపథ్యంలో పోలీసులను బయట ఎంట్రీ ప్రదేశంలో రాత్రీ, పగలూ ఉంచేసి పై భవనాల అంశాన్ని పక్కనపెట్టేసినట్లు కనిపిస్తోంది. రూ.వందల కోట్ల ప్రజాధానంతో నిర్మించాక వీటిని ఎలా వినియోగించాలన్న విషయమై కనీసం ప్రభుత్వ స్థాయిలో కమిటీ వేయాలన్నా కూటమి నేతలు ససేమిరా అంటున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో రాత్రి వేళల్లో లైట్లు ఈ భవంతుల్లో (గతంలో వెలిగేవి) కరెంట్ బిల్లుల ఖర్చుతో కరెంట్‌ను తీసేశారు. బయట దారిలో మాత్రమే కొండపై కొన్ని లైట్లు వెలుగుతున్నాయి. విశాఖ పర్యావరణానికి అండగా ఉండే రుషికొండను పూర్తిగా బోడిగుండు చేసేసి, పచ్చదనాన్ని ధ్వంసం చేశాడన్న విమర్శలు గత ముఖ్యమంత్రి జగన్‌పై పవన్ కల్యాణ్ ఇక్కడకు రెండు దఫాలుగా పర్యటించి

మిగతా 2లో..

పరిహారానికి ఎదురుచూపు

◆వేట నిషేధకాలంలో మత్స్యకారుల అప్పులు

◆తీర్చలేక పెరుగుతున్న వడ్డీ భారం

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

సముద్రంలో చేపల వేట నిషేధ కాలానికి మత్స్యకారులకు చెల్లించాల్సిన పరిహారం ప్రభుత్వం ఇవ్వలేదు. గత ప్రభుత్వం అర్హత కల్గిన మత్స్యకారులకు బ్యాంకు ఖాతాలో రూ.10 వేలు చొప్పున మే రెండోవారంలో జమచేసింది. వేట నిషేధ కాలంలో చెల్లించే పరిహారం రూ.20వేలకు పెంచుతామని ఎన్నికల్లో హామీ ఇచ్చిన చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మత్స్యకారులు ఆశ పడ్డారు. రూ.20వేల పరిహారం కోసం ఎదురుచూస్తున్నారు. ఇప్పటికీ పరిహారం మత్స్యకారుల ఖాతాలో జమచేయకపోవడంతో వేట నిషేధ కాలంలో కుటుంబ అవసరాలకు చేసిన అప్పులు తీర్చలేక వడ్డీలు పెరుగుతున్నాయని మత్స్యకారులు వాపోతున్నారు.

అనకాపల్లి జిల్లాలో 73 కిలోమీటర్ల

మిగతా 2లో..

పూడిమడక తీరంలో వలలు తయారుచేస్తున్న మత్స్యకారులు

పరిహారం రాక అప్పు తీర్చలేకపోయాను

పరిహారం రూ.20వేలు ఇస్తామని ప్రభుత్వమివ్వలేదు. గతంలో మే నెలలో డబ్బులు పడేవి. చేపలవేట లేనికాలంలో రెండు రూపాయల వడ్డీకి రూ.20వేలు అప్పుజేశాను. వేట సరిగాలేక, ప్రభుత్వం డబ్బులు ఇవ్వకపోవడంతో అప్పు తీర్చలేదు. వడ్డీ పెరుగుతుంది.

గంగల సత్తిబాబు, మత్స్యకారుడు పూడిమడక

ప్రభుత్వ సాయం లేదు

బతికే ఆధారంలేనప్పుడు పరిహారం డబ్బులు ఇవ్వకపోతే ఏమి తిని బతుకుతాం. రెక్కలపై బతకడమే గానీ ప్రభుత్వం సాయంలేదు. తెప్పలకు రెండు నెలలవుతున్నా డబ్బులు పడలేదు.

చోడిపల్లి ఎర్రయ్య, పూడిమడక

ఎల్‌జి స్థలంలో కొత్త పరిశ్రమ ఏర్పాటు చేయాలి

▶ వార్త మెయిన్3లో..

ముగిసిన సౌత్ జోన్ ఫిజీషియన్ల సదస్సు

▶ వార్త మెయిన్‌లో..

మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలి

▶ వార్త 8లో..

రోడ్డు సౌకర్యం కల్పించాలని పివిటిజి గిరిజనుల నిరసన

▶ వార్త 7లో..

ధర్నాలో కూర్చున్న సిఐటియు నాయకులు కెఎం.శ్రీనివాసరావు, ఎన్.రామారావు తదితరులు

'ఉక్కు' పరిరక్షణకు మహాధర్నాలు

స్టీల్ సిఐటియు ఆధ్వర్యాన నిర్వాసిత కాలనీల్లో పెద్దఎత్తున నిరసనలు

వార్తలు 4లో..

మానసిక రోగులకు మెరుగైన వైద్యం

ప్రభుత్వ మానసిక వైద్యశాల సూపరింటెండెంట్ కెవి.రామిరెడ్డి

ప్రజాశక్తి-ఎంవిపి.కాలనీ

మానసిక రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం అన్ని రకాలుగా సహకరిస్తుందని ప్రభుత్వ మానసిక వైద్యశాల సూపరింటెండెంట్ కెవి రామిరెడ్డి తెలిపారు. ఆసుపత్రిలో మానసిక రోగులకు, వారి కుటుంబ సభ్యులకు కల్పిస్తున్న సౌకర్యాలు, ఆసుపత్రి నిర్వహణ, అందిస్తున్న చికిత్స వివరాలను ఆయన ప్రజాశక్తితో పంచుకున్నారు.

ఆసుపత్రిలో ఎటువంటి చికిత్సలు అందుబాటులో ఉన్నాయి?

సాధారణ మానసిక సమస్యలైన డిప్రెషన్, యాంగ్జైటీతోపాటు చిన్న పిల్లలకు సంబంధించి ఆర్టిజం, హైపర్ యాక్టివిటీ, చదువులో వెనకబడటం, మానసిక ఎదుగుదల లేకపోవడం తదితర సమస్యలతో పాటు 65 ఏళ్ల పైబడిన వారికి వచ్చే మతిమరుపు, మత్తు పదార్థాలకు, మద్యానికి బానిసలైన వారికి డి ఎడిక్షన్ యూనిట్ ద్వారా చికిత్స అందిస్తున్నాం. రోజువారీ ఓపి రోగులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నాం.

రోగుల తాకిడి ఎలా ఉంటుంది ?

ప్రతిరోజూ కొత్తగా 20 నుంచి 30 వరకు కొత్తగా ఒపి రోగులు వస్తుంటారు. వారు కాకుండా తనిఖీలకు వచ్చేవారు. 100 నుంచి 150 మంది వరకు ఉంటారు. గతంలో చికిత్స చేయించుకొని మందులు వాడుతున్న వారు రోజూ 600 నుంచి 800 మంది వరకు మందుల కోసం ఆసుపత్రికి వస్తూ ఉంటారు.

రోగులకు తగిన మందులు అందుబాటులో ఉన్నాయా? కొరత ఉందా?

మందుల కొరత ఉన్నప్పటికీ ప్రభుత్వానికి ఎప్పటికప్పుడు ఇండెంట్ పెడుతూఉంటాం. అత్యవసరమైతే కావలసిన మందులను ముందుగా

మిగతా 2లో..

జర్నలిస్టుల హెల్త్ కార్డులకు దరఖాస్తులు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : 2024 -25 ఆర్థిక సంవత్సరానికి జర్నలిస్టుల హెల్త్ కార్డుల (డబ్ల్యూజెహెచ్ఎస్) కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. నిబంధనల మేరకు దరఖాస్తులను పూర్తిచేసి సంబంధిత ధ్రువీకరణ పత్రాలను జత చేస్తూ జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ కార్యాలయంలో అందజేయాలని పేర్కొన్నారు. జిల్లాలోని జర్నలిస్టుల విజ్ఞప్తి మేరకు తెల్లరేషన్ కార్డు కలిగి 2023-24 సంవత్సర కాలానికి అక్రిడిటేషన్ పొందిన పాత్రికేయులకు సిఎస్ఆర్ నుంచి రూ.1250 ప్రీమియం చెల్లించేందుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. తెల్ల రేషన్ కార్డు కలిగిన పాత్రికేయులు తెలిపిన డాక్యుమెంట్స్ అన్ని జిల్లా సమాచార పౌర సంబంధాల కార్యాలయంలో ఈ నెలాఖరులోగా అందజేయాలని వివరించారు. రెన్యువల్ కోసం (ఇప్పటికే (డబ్ల్యూహెచ్ఎస్ కార్డు) కలిగి ఉంటే అప్లికేషన్ ఫాం, పాత హెల్త్ కార్డు జెరాక్స్ కాపీ (దరఖాస్తుదారుడు, తెల్ల రేషన్ కార్డు జెరాక్స్, 2023-24 అక్రిడిటేషన్ కార్డు జెరాక్స్ ఇవ్వాల్సి ఉంటుందని తెలిపారు. కొత్త హెల్త్ కార్డు కోసం అప్లికేషన్ ఫాం, తెల్ల రేషన్ కార్డు జెరాక్స్, 2023-24 అక్రిడిటేషన్ కార్డు జెరాక్స్, ఆధార్ కార్డు జెరాక్స్ (కుటుంబ సభ్యులందరివి), ఫొటోలు -2 (కుటుంబ సభ్యులందరివి, ఫ్యామిలి ఫొటో -1 దరఖాస్తుతో పాటుఅందజేయాల్సి ఉంటుందన్నారు. జతపరిచిన ధ్రువపత్రాలు అన్ని స్కాన్ చేసి (ప్రతి ఫైల్ 50 కెబి కంటే తక్కువగా) wjhscards2023 @gmail.comకి ఈ నెలాఖరులోగా మెయిల్ చేయాలని జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి తెలిపారు. తెల్ల రేషన్ కార్డు లేని వారు పాత పద్ధతిలో సిఎఫ్ఎంఎస్ ద్వారా చలానా చెల్లించి, ఆ వివరాలు సమాచార పౌర సంబంధాల శాఖ కార్యాలయంలో అందజేయాలని కోరారు. వివరాలకు (కిషోర్ కుమార్) 8008656504, (బాలాజీ) 99638 55561 ఫోన్ నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

మొదటి పేజీ తరువాయి..

రుషికొండ... గుదిబండేనా!

చేసిన విమర్శలు రాష్ట్రస్థాయిలో 2024 ఎన్నికలకు ముందు రాజకీయ వర్గాల్లోనూ, ప్రజల్లోనూ పెనుసంచలనం రేపాయి. పర్యాటక శాఖ (ప్రభుత్వ ఆధ్వర్యం)లోనే 69 ఎకరాలుండగా వాటిలో 9.88 ఎకరాల్లో భవనాలు ప్రభుత్వం నిర్మిస్తుందంటూ గత జగన్ సర్కారు చెప్పినా ప్రజానీకాన్ని కొండపైకి రానివ్వకపోవడం పెద్ద వివాదంగా మారింది. ప్రస్తుత ప్రభుత్వమైనా ప్రజలను అనుమతిస్తుందా? ఒకవేళ అనుమతించడం గానీ, ఈ భవనాలను కొండను ఉపయోగించడం చేస్తే జగన్‌కు క్రెడిట్ దక్కుతుందన్న విషయం అటుగా దృష్టిపడకుండా చేస్తుందా? సుమారు రూ.500కోట్ల ప్రభుత్వ ప్రాపర్టీని అలా వదిలేస్తారా? అన్న చర్చ కూడా తాజాగా ఈ ప్రాంత ప్రజల్లో సాగుతోంది.

పరిహారానికి ఎదురుచూపు

పొడవున సముద్ర తీరంలో 32 గ్రామాలున్నాయి. 86,497 మంది మత్స్యకార జనాభాలో 2,238 బోట్లలో 12,996 మంది మత్స్యకారులు సముద్రంలో చేపల వేటకు వెళ్తున్నారు. వీరిలో 10,750 మందిని పరిహారానికి అర్హులుగా మత్స్యశాఖ గుర్తించింది. ప్రతియేటా ఏప్రిల్ 15 నుంచి జూన్ 14 వరకు 61 రోజుల పాటు సముద్రంలో చేపల వేట ప్రభుత్వం నిషేధిస్తోంది. నిషేధ కాలంలో మత్స్యకారుల జీవన భృతి కోసం పరిహారం చెల్లిస్తోంది. ఈ ఏడాది ఇవ్వాల్సిన పరిహారం డబ్బులు మత్స్యకారులకు చెల్లించకపోవడంతో వేట నిషేధ కాలంలో కుటుంబ అవసరాలకు రెండు రూపాయల వడ్డీకి తెచ్చిన అప్పు తీర్చుకోలేకపోతున్నామని, తనఖా పెట్టిన బంగారం, వలలు తెచ్చుకోలేకపోతున్నామని పూడిమడక మత్స్యకారులు ప్రజాశక్తి వద్ద వాపోయారు. నిషేధపు రోజుల్లో ప్రభుత్వం డబ్బులు ఇవ్వకపోతే, మరో జీవనాధారంలేని మత్స్యకారులు అత్యధికమంది కుటుంబ అవసరాలకు అప్పులు చేస్తారు. నిషేధ అనంతరం వేటకు వెళ్లి అప్పులు తీర్చుతుంటారు. ఈ ఏడాది వేట సరిగాలేకపోవడం, పరిహారం సొమ్ము ప్రభుత్వం ఇవ్వకపోవడంతో అప్పు తీర్చలేక వడ్డీ భారం పెరుగుతోందని మత్స్యకారులు తెలిపారు.

మానసిక రోగులకు మెరుగైన వైద్యం

ఒప్పందం చేసుకున్న ఫార్మసీ నుంచి తెప్పించి దానికి ప్రభుత్వం ద్వారా బిల్లు చెల్లింపులు చేస్తూ ఉంటాం.

మానసిక రోగాలు నయం కావటానికి ఎంతకాలం పడుతుంది?

మానసిక వ్యాధి అన్నది ఒకసారి వస్తే అది పూర్తిగా నయం కాదు. అందుకే క్యూర్ అనే పదం వాడం. కంట్రోల్ అనే పదం మాత్రమే వాడతాం. మానసిక వ్యాధిని అదుపులో ఉంచగలం కానీ పూర్తిగా నయం చేయలేం.

నూతనంగా చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు ఏమిటి?

ఇటీవల కాలంలో ఈ ఆసుపత్రికి చైల్డ్ సైకాలజీ వార్డు, అడల్ట్ సైకాలజీ వార్డు, డి అడిక్షన్ సెంటర్, రీహాబిటేషన్ సెంటర్ అందుబాటులోకి వచ్చాయి.

రోగులకు ఎటువంటి భద్రతా ప్రమాణాలు పాటిస్తున్నారు? సిబ్బంది కొరత ఏమైనా ఉందా?

ఆసుపత్రికి కొత్తగా వార్డులు వచ్చినప్పటికీ తగిన సిబ్బంది లేక పాత విధానంలో ఉన్న సిబ్బందితోనే ఆసుపత్రి నిర్వహణ సాగుతోంది. సిబ్బంది అవసరమని అధికారులకు తెలియజేశాం. భద్రతా ప్రమాణాలు విషయానికొస్తే ఆసుపత్రి నిర్మాణంలోనే మానసిక రోగులకు అనుకూలంగా ఉండేందుకు తగిన చర్యలు చేపట్టారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం. ఎప్పటికప్పుడు వార్డులను విజిట్ చేస్తూ వారి స్థితిగతులను పర్యవేక్షిస్తూ ఉంటాం. 30 మంది ప్రైవేట్ సెక్యూరిటీ ద్వారా మానసిక రోగులు బయటికి వెళ్లకుండా 24 గంటలు పర్యవేక్షిస్తున్నాం. ఇటీవల కోల్‌కతాలో జరిగిన సంఘటనను దృష్టిలో పెట్టుకొని పీజీ విద్యార్థులు ఉండే బ్లాక్‌కు ప్రత్యేకంగా గ్రిల్స్, నూతన లాకింగ్ విధానాన్ని ఏర్పాటు చేస్తున్నాం.

ఆసుపత్రిలో రోగులకు, బంధువులకు కల్పించే సౌకర్యాలు ఏమిటి?

రోగులకు, వారి బంధువులకు ఇక్కడ పూర్తి వసతులు కల్పిస్తున్నాం. ప్రతిరోగితో ఒక వ్యక్తి ఉండేందుకు అవకాశం ఉంది. వారికి భోజనం, కనీస వసతులు ఇక్కడ లభిస్తాయి. సిబ్బంది నుంచి రోగులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా సాంకేతికతను ఉపయోగించి హాస్పిటల్లోని అన్ని ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటుచేశాం. సిబ్బందితో మాట్లాడేందుకు వాకీ టాకీలను ఏర్పాటు చేశాం. రోగులకు, వారి బంధువులకు ఎటువంటి ఇబ్బందులూ కలగకుండా పూర్తిస్థాయిలో జాగ్రత్తలు చేపడుతున్నాం.

బీచ్ క్లీనింగ్

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : ఇండియన్ కోస్ట్ గార్డ్, బయోప్లాస్టిక్స్ తయారీ సంస్థ ఎకోలాస్టిక్ ప్రొడక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంయుక్త ఆధ్వర్యాన బీచ్ క్లీనింగ్ ప్రోగ్రామ్‌ను చేపట్టాయి. వైజాగ్, కాకినాడలో శుభ్రపరిచే పనిని పూర్తి చేసాయని ఎకోలాస్టిక్ ప్రతినిధి చెప్పారు. ఈ క్లీనింగ్ కార్యక్రమంలో మొత్తం 6,800 మంది పాల్గొన్నారని తెలిపారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్, సముద్ర కాలుష్యం వల్ల కలిగే ప్రమాదాల గురించి అవగాహన కల్పించే లక్ష్యంతో శుభ్రత కార్యక్రమం చేపట్టినట్లు పేర్కొన్నారు. విశాఖ ఆర్కె.బీచ్ పరిశుభ్రతలో కోస్ట్ గార్డ్ డిప్యూటీ కమాండెంట్ రాజేష్ మిట్టల్ పాల్గొన్నారు.

నేషనల్ షార్ట్ ఫిల్మ్ ఫెస్టివల్ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం సహకారంతో, వైజాగ్ షార్ట్ ఫిలిం మేకర్స్ అసోసియేషన్ నిర్వహిస్తున్న నేషనల్ షార్ట్ ఫిలిం ఫెస్టివల్ పోస్టర్‌ను ఆదివారం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో అసోసియేషన్ అధ్యక్షులు అబ్దుల్ అస్రాఫ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశంలో ఉన్న అనేక షార్ట్ ఫిలిం మేకర్స్ కోసం తాము నిర్మించిన చిత్రాన్ని ప్రదర్శించుకోవడానికి అవకాశం కల్పిస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరూ, ఈ షార్ట్ ఫిలిం ప్రదర్శనలో పాల్గొని తమ చిత్రాన్ని ప్రదర్శించుకోవాలని, ప్రదర్శించబడిన ప్రతి సినిమాకు అవార్డు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. అసోసియేషన్ కార్యదర్శి ఎం.ఎల్లాజీ మాట్లాడుతూ, ఇప్పటికే 20కి పైగా షార్ట్ ఫిలిమ్స్ ఎంట్రీలు వచ్చాయని తెలిపారు. ఈనెల 30వ తేదీ వరకు 2 నుంచి 15 నిమిషాలు నిడివి గల లఘు చిత్రాలు ఎటువంటి రుగ్మతలకు దారి లేకుండా అశ్లీలతలు, ఏ మతం, కులంపై విమర్శ లేకుండా అభ్యుదయ అంశాలతో ఉన్న ఏ చిత్రమైన vizagshortfilm-maker@gmail.com కు పంపించాలని పేర్కొన్నారు. వివరాలకు 8919347875 సంప్రదించాలని సూచించారు. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు సంతోష్, శంకర్, రావి పట్నాయక్, కృష్ణ, వెంకటరమణ, ముత్యాలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

మన్యం ధీరుడు చిత్రానికి పన్ను మినహాయింపు ఇవ్వాలి

ప్రజాశక్తి -విశాఖ కలెక్టరేట్ : ఇటీవల విడుదలైన మన్యం ధీరుడు చిత్రానికి పన్ను మినహాయింపు ఇవ్వాలని తెలుగు శక్తి అధ్యక్షులు బివి.రామ్ ముఖ్యమంత్రి చంద్రబాబును కోరారు.ఆదివారం వెంకటేశ్వర థియేటర్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, అల్లూరి సీతారామరాజు జీవిత కథ ఆధారంగా నిర్మించిన మన్యం ధీరుడు చిత్రానికి మంచి ఆదరణ లభిస్తుందన్నారు. అల్లూరి సీతారామరాజు ఆశయాలను ప్రజల్లోకి మరింతగా తీసుకెళ్లేందుకు వీలుగా 15 సంవత్సరాలలోపు పిల్లలకు కేవలం రూ.50కే, పెద్దలకు రూ.100కే మన్యం వీరుడు చిత్రాన్ని చూసే అవకాశం విశాఖలోని వెంకటేశ్వర థియేటర్ కల్పిస్తున్నామని చెప్పారు. చిత్ర దర్శకుడు, హీరో ఆర్‌వివి సత్యనారాయణ మాట్లాడుతూ మన్యం ధీరుడు కమర్షియల్ చిత్రం కాదని, అల్లూరి సీతారామరాజు పోరాట స్ఫూర్తి ప్రతి ఒక్కరిలోనూ ప్రజ్వలింప చేసే విధంగా నిర్మించామని తెలిపారు. సమావేశంలో రంగ సాయి మీడియా బాదంగీర్ సాయి పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీలు అమలు చేయాలి : ఐద్వా

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : కూటమి ప్రభుత్వం 100 రోజుల పాలనను ఎండగడుతూ 28వ వార్డు పందిమెట్ట ప్రజలు ఆదివారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రతిష్టాత్మకంగా ప్రకటించిన ఆరు గ్యారంటీలను ప్లకార్డులపై ప్రదర్శించారు. ఈ సందర్భంగా వార్డు ఐద్వా నాయకురాలు సత్యవతి మాట్లాడుతూ, నిత్యావసర వస్తువుల ధరలు తగ్గిస్తామని, నిరుద్యోగ భృతి ఇస్తామని, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తామని తదితర హామీలు గుప్పించి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం వాటి ఊసే పట్టనట్టుగా వ్యవహరిస్తుందని విమర్శించారు. 'మది మంచి పాలన' అని వారే స్టిక్కర్లు అంటించుకుంటున్నారని ఎద్దేవాచేశారు. నిజానికి ఈ వంద రోజుల్లో ప్రజలకి ఒరిగింది ఏమీ లేదని తెలిపారు. వెంటనే ఇచ్చిన హామీలు అమలు చేయాలని, లేకుంటే ప్రజలు తిరుగుబాటు చేస్తారని హెచ్చరించారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చాలని నినాదాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక మహిళలు పాల్గొని నిరసన తెలిపారు.

పీడిత ప్రజల కోసం సీతారాం ఏచూరి జీవితం అంకితం

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ప్రజా పోరాటాల ద్వారా జీవితాంతం పీడిత ప్రజలకు న్యాయం జరగడం కోసం పనిచేసిన గొప్ప దీరోదాత్త నాయకుడు సీతారాం ఏచూరి అని ఐద్వా జగదాంబ జోన్ అధ్యక్ష కార్యదర్శులు కె.మణి, వరలక్ష్మి అన్నారు. ఐద్వా 28వ వార్డు కమిటీ ఆధ్వర్యాన ఆదివారం పందిమెట్ట జంక్షన్‌లో సీతారాం ఏచూరి సంస్మరణ సభ నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ, సిపిఎం ప్రధాన కార్యదర్శి ఏచూరి సీతారాం జీవితం ఎంతో ఆదర్శప్రాయమన్నారు. అందరికీ మార్గదర్శకం అన్నారు. పార్టీలకతీతంగా ఎందరో నాయకులతో సత్సంబంధాలు కలిగి దేశాభివృద్ధి కోసం ఎన్నో పథకాల రూపకల్పనలో ప్రధాన భూమిక పోషించారన్నారు. మత్స్యకార సంఘం నాయకులు కె.చంద్ర శేఖర్ మాట్లాడుతూ సీతారాం ఏచూరి ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు ఇచ్చే ఘన నివాళి అన్నారు. ఈ కార్యక్రమంలో సత్య, మల్లి, లక్ష్మి, రాజేశ్వరమ్మ, ఉమ పాల్గొన్నారు.

గురజాడ అడుగుజాడలో నడుస్తాం

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ: వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గురజాడ 162వ జయంతి విశాఖ జిల్లాలో చిల్డ్రన్స్ క్లబ్స్, ట్యూషన్ సెంటర్లలో ఘనంగా నిర్వహించారు. విసిసి, ఆసరా చారిటబుల్ సొసైటీ, విశ్వ మానవ సంక్షేమ సంఘం, రోటరీ క్లబ్ సహకారంతో ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమాల్లో పిల్లలు గురజాడ పద్యానికి డ్రాయింగ్ వేశారు. పిల్లలు గురజాడ వేషధారణ వేశారు. గురజాడ గొప్ప తనం గురించి వివరించారు. దేశభక్తి గేయాన్ని సమిష్టిగా భావయుక్తంగా పాడారు. ఈ కార్యక్రమంలో పరదేశిపాలెం, మారికవలస, ఆరిలోవ, మద్దిలపాలెం, జగదాంబ, కంచరపాలెం, గాజువాక, మల్కాపురం ప్రాంతాల క్లబ్‌లకు చెందిన చిన్నారులు, విసిసి వ్యవస్థాపకులు డాక్టర్ కె.రమాప్రభ, పి.సతీష్, డి.కొండమ్మ, స్వర్ణలత, మంగశ్రీ పాల్గొన్నారు.

పలు రైళ్లు రద్దు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : దక్షిణ మధ్య రైల్వేలోని విజయవాడ డివిజన్ కొవ్వూరు - గోదావరి - రాజమండ్రి - కడియం సెక్షన్ల మధ్య ఆటోమేటిక్ బ్లాక్ సిగ్నలింగ్ సిస్టం ప్రారంభించడానికి ఇంటర్ లాకింగ్ పనులు కారణంగా పలు రైళ్లను రద్దుచేశారు. ఈ నెల 29న 22708 తిరుపతి-విశాఖపట్నం డబుల్ డెక్కర్ ఎక్స్‌ప్రెస్, 17239 గుంటూరు-విశాఖపట్నం సింహాద్రి ఎక్స్‌ప్రెస్‌లను, 30వ తేదీన 22707 విశాఖపట్నం-తిరుపతి డబుల్ డెక్కర్ ఎక్స్‌ప్రెస్, 12718 విజయవాడ-విశాఖపట్నం రత్నాచల్ ఎక్స్‌ప్రెస్, 12717 విశాఖపట్నం-విజయవాడ రత్నాచల్ ఎక్స్‌ప్రెస్, 22701 విశాఖపట్నం - గుంటూరు ఉదయ్ ఎక్స్‌ప్రెస్, 22702 గుంటూరు - విశాఖపట్నం ఉదయ్ ఎక్స్ ప్రెస్, 17239 గుంటూరు-విశాఖపట్నం సింహాద్రి ఎక్స్‌ప్రెస్, 17240 విశాఖపట్నం- గుంటూరు సింహాద్రి ఎక్స్‌ప్రెస్, 07466 రాజమండ్రి-విశాఖపట్నం మెము ప్యాసింజర్, 07467 విశాఖపట్నం- రాజమండ్రి మెము ప్యాసింజర్, అక్టోబర్ 1వ తేదీన 17240 విశాఖపట్నం- గుంటూరు సింహాద్రి ఎక్స్‌ప్రెస్‌లను రద్దు చేశారు. ప్రజలు మార్పులను గమనించి తదనుగుణంగా వ్యవహరించాలని ఈస్ట్ కోస్ట్ రైల్వే - వాల్తేరు డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె.సందీప్ కోరారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ: జివిఎంసి ప్రధాన కార్యాలయం, అన్ని జోనల్ కార్యాలయాలలో "ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం" సోమవారం ఉదయం 11నుంచి మధ్యాహ్నం 1.00 గంట వరకు ఉంటుందని మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, జివిఎంసి కమిషనర్ డాక్టర్ పి.సంపత్‌కుమార్ తెలిపారు.

IN THE HON'BLE COURT OF THE 3RD ADDITIONAL CIVIL JUDGE (JUNIOR DIVISION) OS 659/2022

Between:
1) State Bank of India Bhogapuram Branch vizianagaram represented by its authorized signatory Deepthi Tarapatla Manager (SARC) RASMECC State Bank of India NCS Road Vizianagaram ....Plaintiff

And:
M/S RK FILLING STATION
Represented by its sole proprietor
Sri KAMIDI RADHA KRISHNA PRASAD S/O SESHA RAO ....Defendant

To
Sri KAMIDI RADHA KRISHNA PRASAD S/O SESHA RAO, IOC Dealer Akkireddi palem NH5 Road -Polipalli village Near Rajapulova Junction Bhogapuram Mandalam Vizianagaram District,
Residing at 8-6-43/D Peda waltair, Visakhapatnam Urban, LB Colony, VISAKHAPATNAM 530017.

Please take notice that the above matter is posted to **25-09-2024.** You shall appear inperson or through your Advocate, by **10.30 AM,** failing which the matter will be decided Ex Partee.

PVS Prasad
Advocate for the Plaintiff
Vizianagaram
Cell: 7799955633,

ఇంకెన్నాళ్లీ ఎదురుచూపులు..!

రైతుబజారు పనుల్లో కానరాని కదలిక!

- పిచ్చిమొక్కలతో కళావిహీనంగా ప్రాంగణం
- పూర్తికాక ముందే రూపుకోల్పోతున్న నిర్మాణాలు
- కూటమి నేతల హామీలపైనే స్థానికుల ఆశలు

ప్రజాశక్తి - ఆరిలోవ : జివిఎంసి 10వ వార్డు, తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నిర్మిస్తున్న రైతుబజారు ఎప్పుడు అందుబాటులోకి వస్తుందోనని ఆరిలోవ పరిసర ప్రాంతాల ప్రజలు కొన్నాళ్లుగా ఆశగా ఎదురుచూస్తున్నారు. మంజూరైన తొలినాళ్లలో పనులు శరవేగంగా సాగినప్పటికీ, సంబంధిత కాంట్రాక్టర్‌కు పైసా బిల్లుకూడా చెల్లించకపోవడంతో పనులు నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత టిడిపి నేతలు దీన్ని సందర్శించి, అతిత్వరలో వినియోగంలోకి తెస్తామని హామీనిచ్చినప్పటికీ, పనుల్లో కదలిక లేకపోవడంతో స్థానికులు నిరాశ చెందుతున్నారు.

జివిఎంసి 10వ వార్డు, తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ఆనుకొని 48 సెంట్ల భూమిలో రైతుబజార్ నిర్మాణం కోసం రూ.80లక్షల నిధులను గత ప్రభుత్వం కేటాయించింది. 48 షాపులు, ఒక కార్యాలయం, ఒక స్టోర్ గది, టాయిలెట్ల బ్లాక్, ఒక ఆర్‌ఒ ప్లాంట్‌తో పనులు చేపట్టాలన్నది అంచనా. నిర్మాణ పనులు ప్రారంభమైన తొలిరోజుల్లో జోరుగా సాగి, 70 శాతం మేర పూర్తయ్యాయి. అయితే చేసిన పనులకు సంబంధిత కాంట్రాక్టర్‌కు ఇప్పటివరకు ఒక్క పైసా బిల్లు చెల్లించకపోవడంతో, పనులు కొనసాగించలేక చేతులెత్తేయడంతో నిర్మాణం నిలిచి పోయింది. నెలలు తరబడి పనులు ముందుకు సాగకపోవడంతో నిర్మాణ ప్రాంతంలో పిచ్చి మొక్కలు పెరిగి, మొత్తం కళావిహీనంగా మారుతుంది.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆయా పార్టీల నేతలు రైతుబజార్‌ను సందర్శించారు. అక్కడి పరిస్థితులపై ఆవేదన వ్యక్తం చేశారు. రైతు బజారు మంజూరు చేసినా, చేసిన పనులకు బిల్లులు ఇవ్వని గత ప్రభుత్వం తీరుపై విమర్శలు గుప్పించారు. వెంటనే పనులు ప్రారంభించి, అతిత్వరలో అందుబాటులోకి తీసుకు వస్తామని హామీ కూడా ఇచ్చారు. అయితే ఇప్పటికీ పనులు ప్రారంభించక పోవడంతో స్థానికులు నిరాశ చెందుతున్నారు. ఇప్పటికైనా కూటమి నేతలు, అధికారులు చొరవ చూపి రైతుబజార్ నిర్మాణ పనులు వెంటనే ప్రారంభించి, పూర్తిచేయడం ద్వారా అందుబాటులోకి తేవాలని స్థానికులు కోరుతున్నారు.

నిర్మాణ పనులు నిలిచిపోవడంతో పిచ్చిమొక్కలతో నిండిన రైతు బజార్ నిర్మాణాలు

నేరాలు ఘోరాలు

కారు ఢీకొని యువకుడు దుర్మరణం

ప్రజాశక్తి-నక్కపల్లి : మండలంలోని ఉద్దండపురం జాతీయ రహదారిపై శనివారం అర్ధరాత్రి కారు ఢీకొని యువకుడు మృతి చెందినట్లు సీఐ కె.కుమారస్వామి తెలిపారు. గ్రామానికి చెందిన ఆవాల దుర్గారావు (26) రోడ్డు దాటుతుండగా నక్కపల్లి వైపు నుంచి తుని వైపు వెళుతున్న కారు ఢీకొంది. ప్రమాదంలో తీవ్రగాయాలైన దుర్గారావును తుని ఏరియా ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడు. మృతునికి భార్య, పసిపాప ఉన్నారు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ వెంకటరావు కేసు నమోదు చేశారు.

సారా పులుపు ధ్వంసం

ప్రజాశక్తి- కోటవురట్ల: మండలంలో బికెపల్లి గ్రామంలో సారా పులుపును ఆదివారం స్థానిక పోలీసులు ధ్వంసం చేశారు, స్థానిక ఎస్సై రమేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ దాడుల్లో సుమారు 1500 లీటర్ల సారా పులుపును ధ్వంసం చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని ఈ హెచ్చరించారు. ఈ దాడుల్లో స్థానిక పోలీసులు పాల్గొన్నారు.

సాయిబాబా ఆలయంలో చోరీ

ప్రజాశక్తి-చోడవరం : స్థానిక షిరిడి సాయిబాబా ఆలయంలో ఆదివారం పట్టపగలే చోరీ జరిగింది. ఆలయంలో స్వామివారి విగ్రహానికి ఉన్న వెండి కిరీటం, సింహాసనానికి ఇరువైపులా ఉన్న వెండి తాపడం, సింహపు బొమ్మ గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకుపోయారు. వీటి విలువ సుమారు లక్ష రూపాయలు ఉంటుందని ఆలయ నిర్వాహకులు చెబుతున్నారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. చోడవరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఆలయంలోనూ, పరిసర ప్రాంతాల్లో ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించారు.

ఏడుగురు జూదరుల అరెస్ట్

ప్రజాశక్తి -ఆనందపురం: మండలంలోని వెల్లంకి సమీపంలోని గోకార్డు ఎదురుగా పేకాట ఆడుతున్న ఏడుగురిపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు సిఐ చింత వాసునాయుడు తెలిపారు. నిందితుల నుంచి రూ. 70వేలు స్వాధీనం చేసున్నారు.

ఇద్దరు ఎమ్మెల్యేలను సస్పెండ్ చేయాలి

ప్రజాశక్తి -గాజువాక : అంబేద్కర్‌ను అవమానించిన ఉండి ఎమ్మెల్యే రఘురామ కృష్ణంరాజును సస్పెండ్ చేయాలని, రంగరాయ మెడికల్ కాలేజీలో వివాదాన్ని సృష్టించి, దళిత డాక్టర్ ఉమామహేశ్వరరావు పై దాడి చేసిన కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీని తక్షణమే అరెస్టు చేయాలని విదసం ఐక్య వేదిక ఏపి స్టేట్ కౌన్సిల్ కన్వీనర్ డాక్టర్ బూసి వెంకటరావు డిమాండ్ చేశారు. ఆదివారం గాజువాకలోని ప్రయివేటు హోటల్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ గత ప్రభుత్వం దళితులపై దాడులు, దౌర్జన్యాలకు ప్రతీకారంగానే రాష్ట్రంలోని దళితులందరూ ఏకమై జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని గద్దె దింపారని, ఇపుడు కూటమి ప్రభుత్వంలోనూ కొందరు నేతలు అదే సంస్కృతిని కొనసాగించడం దుర్మార్గమన్నారు.ఇద్దరు ఎమ్మెల్యేలపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదుచేసి చర్యలు తీసుకోవాలని, తక్షణం పదవుల నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బల్ల కుమార్, గుడివాడ ప్రసాద్, గుడాల ఈశ్వరరావు, యుఎస్ రాజు, మండే సత్యనారాయణ, గోసంగి తిరుపతిరావు పాల్గొన్నారు.

విండ్ బాల్ క్రికెట్ పోటీలు ప్రారంభం

పోటీలను ప్రారంభిస్తున్న బాలకృష్ణ

ప్రజాశక్తి -గాజువాక : జీవీఎంసీ 76వ వార్డు సీరవానిపాలెంలో వార్డుస్థాయి ప్రీమియం లీగ్ విండ్ బాల్ టోర్నమెంట్‌ను ఆదివారం స్థానిక కార్పొరేటర్, జివిఎంసి డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ గంధం శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువత చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని, క్రీడలతో మానసికోల్లాసంతోపాటు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. కార్యక్రమంలో వార్డ్ టిడిపి నాయకులు ఖాతా బాలకృష్ణ, శిర చిన్నోడు, శివ క్రీడాకారులు పాల్గొన్నారు..

నూతన ఇసుక విధానంతో ఇబ్బందులు

మాట్లాడుతున్నఅసోసియేషన్ అధ్యక్షుడు వెంకటరమణ

ప్రజాశక్తి -ఆనందపురం: కూటమి ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన నూతన ఉచిత ఇసుక విధానంతో లారీ ఓనర్స్, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని లారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు మద్దెల వెంకటరమణ ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం గంభీరం హైస్కూల్ సమీపంలో నిర్వహించిన అసోసియేషన్ సమావేశంలో మాట్లాడుతూ, ఆన్‌లైన్ ఇసుక విధానంతో ఇప్పటివరకు ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఇసుక అందుబాటులో లేకపోవడం, శ్రీకాకుళంజిల్లో బ్లాక్‌మార్కెట్‌లో అధిక ధరకు ఇసుక అమ్మకాలు, ఓవర్‌లోడ్ పేరుతో పోలీసుల కేసులతో లారీ ఓనర్స్ మనుగడ కష్టమౌతోందన్నారు. దీనిపై సిఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో కార్యదర్శి వెంకటరమణ, అసోసియేషన్ ఉపాధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, సురేష్, జాయింట్ సెక్రెటరీలు శ్రీనివాసరావు భాస్కరరావు, ట్రెజరర్ నమ్మి అప్పల మాధవరావు, పాల్గొన్నారు.

నదుల పరిరక్షణపై అవగాహన

ప్రజాశక్తి -భీమునిపట్నం : నదులను పరిరక్షించు కోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని స్థానిక ప్రభుత్వ డైట్ విశ్రాంత అధ్యాపకులు డి వెంకట సుబ్బరాజు పిలుపునిచ్చారు. ఆదివారం ప్రపంచ నదుల దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ డైట్‌లో అధ్యాపకులు గొట్టేటి రవి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ, నదులను పరిశుభ్రంగా ఉంచాలని, అనేక చోట్ల నదీ మార్గాలు ఆక్రమణలకు గురికావడం వల్లే వరద ముంపు అనర్థాలతోపాటు ప్రపంచంలో అనేక నదులు అంతరించి పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తరచూ బీచ్‌ను శుభ్రపరుస్తున్న ట్లే, నదీ పరివాహక ప్రాంతాలను శుభ్రం చేయాల్సిన అవసరం ఉందన్నారు. నదుల ప్రాధాన్యత వివరిస్తూ ఛాత్రోపాధ్యాయులు ప్లకార్డులను చేత బట్టి ప్రదర్శన నిర్వహించారు

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి- సీతమ్మధార : జివిఎంసి 14వ వార్డులో రూ.19 లక్షల జివిఎంసి నిధులతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు ఆదివారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ కటారి అనిల్‌కుమార్ రాజు, జివిఎంసి డిఇఇ శ్రీనివాసరావు, ఎఇఇ శ్రీనివాస్, వర్క్ ఇన్‌స్పెక్టర్ అనిల్ కుమార్, కూటమి నేతలు పాల్గొన్నారు.

సహకార సంఘాలపై సర్కారు శీతకన్ను

భెల్ త్రిఫ్ట్ సొసైటీ మహాజన సభలో ప్రకాష్

మాట్లాడుతున్న జిటివి. ప్రకాష్

ప్రజాశక్తి -గాజువాక : సహకార సంఘాలపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సవతి తల్లి ప్రేమ చూపిస్తున్నాయని భెల్ ఎంప్లాయిస్ కోఆపరేటివ్ త్రిఫ్ట్ అండ్ క్రెడిట్ సొసైటీ డైరెక్టర్ జిటిపి ప్రకాష్ ధ్వజమెత్తారు. ఆదివారం సంఘ కార్యాలయంలో నిర్వహించిన భెల్, హెచ్‌పివిపి ఎంప్లాయిస్ కోఆపరేటివ్ త్రిఫ్ట్ అండ్ క్రెడిట్ సొసైటీ 55వ మహాజనసభలో మాట్లాడుతూ, వంద రోజుల పాలనలో సహకార సంఘాలకు సాయంపై రాష్ట్ర ప్రభుత్వం ఇటువంటి ప్రకటన చేయలేదన్నారు. కంపెనీలో సభ్యులు తగ్గిపోతే సొసైటీ వ్యాపారం తగ్గుతుందని, సభ్యులను పెంచాలన్నారు. సొసైటీలో రాజకీయ జోక్యం తగదన్నారు. అందరు డైరెక్టర్లతో కలిసి ఐక్యమత్యంతో ముందుకు సాగుదామని పిలుపునిచ్చారు. సంఘ కార్యదర్శి మండ వెంకటరాజు మాట్లాడుతూ, సభ్యుల రుణపరిమితిని రూ.రెండు లక్షల నుంచి రూ.ఆరు లక్షలకు పెంచడంతోపాటు వడ్డీని 13శాతం నుంచి 12శాతానికి తగ్గిస్తూ మహాజనసభలో తీర్మానించినట్లు వెల్లడించారు. రూ.5.48 కోట్ల టర్నోవర్ కలిగిన సంఘంలో 386 మంది సభ్యులుండగా, ఈ ఏడాది వార్షిక ఆదాయము రూ.2,19,550 వచ్చినట్లు కార్యదర్శి నివేదికలో వెల్లడించారు. సంఘం బైలా నెంబర్ 4,18, 19, 41(ఎ)లను సవరణ చేస్తున్నట్లుగా తెలిపారు.సంఘ అధ్యక్షులు కె.రామునాయుడు అధ్యక్షత వహించిన సభలో ఉపాధ్యక్షులు కె. ధర్మారావు 2024-25 సంవత్సర వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టగా ఆమోదించారు. కార్యక్రమంలో సంఘ డైరెక్టర్లు జి.ప్రసాద్, ఎన్‌బి. ప్రశాంత్‌కుమార్, సంఘ మేనేజర్ జివి రమణా రావు, సంఘ సభ్యులు, హెచ్‌పివిపి యూనిట్‌లోని వివిధ యూనియన్ల నాయకులు పాల్గొన్నారు..

ప్రభుత్వ నిర్ణయంపై గీత కార్మికుల హర్షం

ప్రజాశక్తి -భీమునిపట్నం : మద్యం పాలసీపై కూటమి ప్రభుత్వం తీసుకొన్న నిర్ణయాల్లో భాగంగా 10శాతం వైన్ షాపులను గీతకర్మికులకు కేటాయించడంపై గీత కార్మికులు హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం మూడో వార్డు నేరెళ్ల వలస కాలనీ సామాజిక భవనంలో కల్లు గీత సహకార సంఘాల అధ్యక్షుల సమావేశంలో యా త సంఘం రాష్ట్ర అధ్యక్షులు అంగటి రాము మాట్లాడుతూ, గీత కార్మికులకు ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం 10 శాతం మద్యం దుకాణాలు కేటాయించడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో సంఘాల ప్రతినిధులు చిట్టిబోయిన రాము, రీసు రమణ, గండిబోయిన రమణ, కాకర ఎల్లారావు పాల్గొన్నారు

సభలో మాట్లాడుతున్న రాము

24,25 తేదీల్లో జాతీయ మహాసభలు

ప్రజాశక్తి- సీతమ్మధార : ఈ నెల 24, 25 తేదీల్లో బెంగళూరులో నిర్వహించనున్న అఖిల భారత రోడ్డు ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ 18వ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని ఏపి ఆటోడ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్, ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి వామనమూర్తి పిలుపునిచ్చారు. ఆదివారం రైల్వేస్టేషన్ ఇన్ గేట్ జంక్షన్ వద్ద ఆటోడ్రైవర్లతో ప్రచార సమావేశంలో మాట్లాడారు. కార్యక్రమంలో రావి కృష్ణ, వై వెంకట్, ఎస్ చెన్నారెడ్డి, హెచ్.ఎ.ఖాన్, హెడ్ శేఖర్, జి గణేష్‌కుమార్, పాల్గొన్నారు.

చనిపోయిన కోళ్లతో దుర్గంధం

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని పొట్నూరు గ్రామంలో గులుమజ్జి వారి కల్లాల వద్ద కోళ్లఫారాల్లో చనిపోయిన కోళ్లను సమీప నివాస ప్రాంతాల్లో చెరువులు, వాగు, గెడ్డలు ప్రదేశాల్లో బహిరంగ ప్రదేశాల్లో పడేయడంతో అవి కుళ్లి వెలువరుస్తున్న దుర్గంధంతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. చనిపోయిన కోళ్ల కళేబరాలను కుక్కలు, గెద్దలు, కాకులు తింటూ వ్యర్థాలను ఎక్కడికక్కడే పడేస్తున్నాయని, దీంతో వ్యాధులు ప్రబలుతాయేమోనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు ఫిర్యాదుచేశారు.

70 మంది స్వచ్ఛందంగా రక్తదానం

మామిడిలోవలో రక్తదానం చేస్తున్న యువతులు

ప్రజాశక్తి- ఆనందపురం : సత్యసాయిబాబా99వ జన్మదిన వేడుకల్లో భాగంగా ఆదివారం మండలంలోని మామిడిలోవ కమ్యూనిటీ హాల్ వద్ద మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. సాయి సేవాదళ్ రాష్ట్ర జాయింట్ కోఆర్డినేటర్ డి రాఘవరావు ప్రారంభించి, సాయి భక్తులు బలిరెడ్డి పెంటయ్య, బలిరెడ్డి అప్పల రాము, కోరుకొండ సంతోష్ ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో ముగ్గురు యువతితోపాటు 70 మంది రక్తదానం చేశారు. విశాఖపట్నం ఎఎస్ రాజా బ్లడ్ బ్యాంక్ డాక్టర్ ఎస్.దివ్యవాణి బృందం రక్తాన్ని సేకరించారు. మానాపురం సత్యసాయి కుమార్ పర్యవేక్షణలో బి సాయికుమార్, ఏ దేవుడు బాబు, డి అప్పలరాజు, కోరాడ తమ్మునాయుడు, ఆనందపురం భజన మండలి సేవాదళ్ కోఆర్డినేటర్ కొట్యాడ లక్షణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

దళిత ప్రొఫెసర్‌పై దాడికి బాధ్యులను శిక్షించాలి : కెవిపిఎస్

మాట్లాడుతున్న సుబ్బన్న, చిరంజీవి

ప్రజాశక్తి -గాజువాక: కాకినాడ రంగరాయ మెడికల్ కళాశాల మైదానంలో కాలేజీ ఫోరెన్సిక్ విభాగ అధిపతి ప్రొఫెసర్ ఉమా మహేశ్వరరావును దుర్భాషలాడడంతోపాటు దాడికి పాల్పడిన కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, అతని మేనల్లుడు బన్నీ, అనుచరులపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేయాలని కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు కె.సుబ్బన్న, జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుకోటి చిరంజీవి డిమాండ్ చేశారు. ఆదివారం సమావేశంలో మాట్లాడుతూ, దళిత ప్రొఫెసర్ విధులకు ఆటంకం కలిగించడమే కాకుండా దౌర్జన్యంగా దాడికి పాల్పడిన వారిపై తక్షణమే కేసులు చేయాలని డిమాండ్ చేశారు.

కేన్సర్ నిర్ధారణ వైద్యశిబిరం

ప్రజాశక్తి- గాజువాక : స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్టు లేబర్ యూనియన్, (సిఐటియు), స్త్రీల్‌ట్రిప్లు సొసైటీ, ఐద్వా ఆధ్వర్యంలో ఆదివారం పెదగంట్యాడ నడుపూరు కళాభవన్‌లో ఆదివారం కేన్సర్ నిర్ధారణకు ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. మహాత్మాగాంధీ కేన్సర్ ఆసుపత్రి సౌజన్యంతో నిర్వహించిన శిబిరంలో డాక్టర్ సునందా. డాక్టర్ సుకన్య మాట్లాడుతూ, మహిళల్లో రొమ్ము, గర్భాశయ ముఖద్వారం, నోటి కేన్సర్ కేసులు ఇటీవల పెరుగుతున్నాయని,ప్రాథమిక దశలో గుర్తిస్తే నివారణ సాధ్యమన్నారు.

దీనిపై ప్రజల్లో అవగాహనకు ఆది, సోమవారాల్లో ఉచిత కేన్సర్ నిర్ధారణ శిబిరం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో ట్రిప్లు సొసైటీ చైర్మన్ పి నారాయణరావు. డైరెక్టర్లు . శశిభూషణ్, ఎస్.నాగకృష్ణ, కె సత్యవతి, స్టీల్‌కాంట్రాక్టు లేబర్ యూనియన్ సిఐటియు నాయకులు నమ్మి రమణ, జి శ్రీనివాసరావు, ఐద్వా జిల్లా కార్యదర్శి సత్యవతి, కేన్సర్ ఆసుపత్రి పిఆర్‌ఒ పిఎం నాయుడు. సిఐటియు సీనియర్ నాయకుడు డి వెంకటరావు పాల్గొన్నారు.

నేటి నుంచి మండలస్థాయి క్రీడా పోటీలు

ప్రజాశక్తి -తగరపువలస : చిట్టివలస జెడ్‌పి బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఈ నెల 23, సోమవారం నుంచి మూడురోజుల పాటు మండలస్థాయి క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు పోటీల సమన్వయకర్త సిహెచ్ వెంకట రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.అండర్-14, అండర్ -17 కేటగిరీల్లో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, చెస్, యోగా, షటిల్ బ్యాడ్మింటన్, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు పాల్గొని వచ్చని సూచించారు క్రీడా పోటీలను జయప్రదం చేయాలని కోరారు

'ఉక్కు' పరిరక్షణకు మహాధర్నాలు

● స్టీల్ సిఐటియు ఆధ్వర్యంలో నిర్వాసిత కాలనీల్లో పెద్దఎత్తున నిరసనలు

పెదగంట్యాడలో మహాధర్నాలో పాల్గొన్న సిఐటియు నేతలు

ప్రజాశక్తి- ఉక్కునగరం : స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలన్న డిమాండ్‌తో పెదగంట్యాడ, అగనంపూడి, వడ్లపూడి, స్టీల్‌ప్లాంట్ జంక్షన్ నిర్వాసిత కాలనీల్లో మహాధర్నా, నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. స్టీల్‌ప్లాంట్‌ను పూర్తిసామర్థ్యంతో నడపాలని, కాంట్రాక్ట్ కార్మికులకు ప్రతిరోజూ పని కల్పించాలని, రూ.పది కోట్ల అడ్వాన్స్ చెల్లించి, ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులను ఆదుకోవాలని స్టీల్ సిఐటియు నేతలు డిమాండ్ చేశారు.

స్టీల్‌ప్లాంట్‌పై మార్పులేని బిజెపి వైఖరి

విశాఖ స్టీల్‌ప్లాంట్‌పై కేంద్ర బిజెపి ప్రభుత్వ వైఖరిలో ఏమాత్రం మార్పులేదని 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు ధ్వజమెత్తారు. ఆదివారం స్టీల్ సిఐటియు ఆధ్వర్యంలో కెబిఆర్ జంక్షన్ వద్ద స్టీల్ ప్లాంట్ రక్షణకు మహాధర్నాలో పెద్దఎత్తున కార్మికులు పాల్గొని, కేంద్ర ప్రభుత్వం, స్టీల్ యాజమాన్యానికి వ్యతిరేకంగా నినదించారు. ధర్నాను ఉద్దేశించి డాక్టర్ బి. గంగారావు మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వ చర్యలతో ప్లాంట్ పరిస్థితి నానాటికీ దిగజారిపోతోందని మండిపడ్డారు. కేంద్ర ఉక్కు మంత్రి హెచ్‌డి కుమారస్వామి, సహాయ మంత్రి శ్రీనివాసవర్మ స్టీల్‌ప్లాంట్‌ను సందర్శించి, రక్షిస్తామని ప్రకటించారని, అయితే దానికి విరుద్ధంగా ఇక్కడ చర్యలు ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా నమ్మకాన్ని కోల్పోకముందే ప్లాంట్ రక్షణకు ఇచ్చిన హామీనిసిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ నేతృత్వంలోని రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రభుత్వ రంగంలోనే కొనసాగించడం, లేకుంటే సెయిల్‌లో విలీనం చేయడంతోపాటు, సొంత గనులు కేటాయించి, పూర్తిస్థాయి ఉత్పత్తికి తక్షణమే కేంద్రంపై ఒత్తిడి చేయాలని డిమాండ్ చేశారు. స్టీల్ సిఐటియు అధ్యక్షులు వైటి దాస్ మాట్లాడుతూ శనివారం స్టీల్ అఖిలపక్ష కార్మిక సంఘాలతో సిఎండి సమావేశం నిర్వహించారని, సాయంత్రానికి కార్మికుల హెచ్‌ఆర్‌ఎ, ఎల్‌టిఎ నిలుపుదల చేస్తూ సర్కులర్ జారీ చేయడం దుర్మార్గమన్నారు. 78వ వార్డు మాజీ కార్పొరేటర్ కె.విమల మాట్లాడుతూ కేంద్రం స్టీల్‌ప్లాంట్‌ను అమ్మకానికి పెట్టడం దుర్మార్గమని, రాష్ట్ర ప్రభుత్వం తక్షణం జోక్యం చేసుకుని విశాఖ ఉక్కును పరిరక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో స్టీల్ సిఐటియు నాయకులు బి అప్పారావు, తౌడన్న, పుల్లారావు, వి ప్రసాద్, ఆర్ వెంకట్రావు, కె సత్యనారాయణ, బి మహేష్, కె బాలశౌరి, చిరంజీవి, కె ఆర్ కె రాజు, డి దుర్గాప్రసాద్ కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ నాయకులు వివి రమణ వివిధ విభాగాల అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు. ప్రజానాట్యమండలి కళాకారులు అభ్యుదయ గీతాలతో అలరించారు.

కార్మికోద్యమంతో అమ్మకానికి వెనుకడుగు

విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు ప్రయివేటుపరం కాకుండా అఖిలపక్ష స్టీల్‌ప్లాంట్ కార్మికుల వీరోచిత పోరాటం అడ్డుకట్ట వేసిందని స్టీల్ సిఐటియు గౌరవాధ్యక్షుడు జె.అయోధ్య రాం అన్నారు. కూర్మన్నపాలెం ముస్తఫా జంక్షన్ వద్ద స్టీల్ సిఐటియు ఆధ్వర్యంలో నిర్వహించిన స్టీల్ ప్లాంట్ రక్షణ ధర్నాలో మాట్లాడుతూ స్టీల్ ప్లాంట్ స్థాపనకు ప్రభుత్వం రూ.4890 కోట్లను ఇస్తే, స్టీల్ ప్లాంట్ తిరిగి కేంద్రానికి రూ.55 వేల కోట్లను చెల్లించిందన్నారు. కార్పొరేట్లుకు గడచిన పదేళ్లలో రూ. లక్షల కోట్ల రుణమాఫీ చేస్తున్న కేంద్ర ప్రభుత్వం, విశాఖ స్టీల్‌కు కనీసం రూ.పది వేల కోట్లయినా ఇవ్వకపోగా, అప్పు తెచ్చుకోవడానికినీసం బ్యాంకు గ్యారంటీ ఇవ్వట్లేదని మండిపడ్డారు. కార్యక్రమంలో . కె జగ్గారావు, సంతోష్ కుమార్ రాజు, మార్పు దానయ్య, కె శ్రీనివాసరావు, డి ఎస్ వి ఎస్ శ్రీనివాస్, సోమినాయుడు, గంగాధర్, పి రమణ తదితరులతోపాటు వివిధ విభాగాల అధ్యక్ష కార్యదర్శులు, మహిళలు పాల్గొన్నారు.

ఉక్కు పరిరక్షణ ఉద్యమం బలోపేతమే లక్ష్యం

అగనంపూడి ఎన్‌బిఐ జంక్షన్ వద్ద స్టీల్ సిఐటియు ఆధ్వర్యంలో పెదిరెడ్ల నీలకంఠ అధ్యక్షతన నిర్వహించిన మహాధర్నాలో స్టీల్ సిఐటియు గౌరవ అధ్యక్షులు జె. అయోధ్యరామ్ మాట్లాడుతూ నిర్వాసిత గ్రామాల్లో ఉక్కు పరిరక్షణ ఉద్యమాన్ని బలోపేతం చేయడమే లక్ష్యంగా ఈ మహాధర్నాలు నిర్వహించినట్లు వెల్లడించారు. కార్యక్రమం లో సిఐటియు ప్రధాన కార్యదర్శి యు రామస్వామి, అధ్యక్షులు వైటి దాసు,ఉరిటి మరిడయ్య ,పట్టా రమేష్, అబ్బాయి, ఉరిటి అప్పలరాజు, మొల్లి కోటేశ్వరరావు, శిరెడ్డి నర్సింగరావు, బొట్ట గంగరాజు పాల్గొన్నారు

గాజువాక : విశాఖ ఉక్కు రక్షణకు స్టీల్ సిఐటియు ఆధ్వర్యంలో పెదగంట్యాడ జంక్షన్ వద్ద ఆదివారం మహాధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా సిఐటియు విశాఖ జిల్లా అధ్యక్షులు. కెఎం శ్రీనివాసరావు మాట్లాడుతూ స్టీల్ ఉత్పత్తికి అవసరమైన ముడిసరుకు ఇనుప ఖనిజం, బొగ్గు సరఫరా లేకుండా చేసి ఉక్కు ఉత్పత్తి గణనీయంగా పడిపోయేలా చేసిందన్నారు. ముఖ్యంగా విశాఖ స్టీల్‌ప్లాంట్‌లోని మూడు బ్లాస్ట్‌ఫర్నేస్‌లలో రెండింటిని నిలుపుదల చేసి, కేవలం ఒక్కదానితోనే ఉత్పత్తి చేస్తున్న దుస్థితి కల్పించిందన్నారు..ఉక్కు పరిరక్షణకు హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం దీనిపై సరైన చర్యలు తీసుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు సిఐటియు నేతలు. యు. రామస్వామి, పి శ్రీనివాసరాజు, సిపిఎం జిల్లా కార్యదర్శి. ఎం జగ్గునాయుడు, నమ్మి రమణ, జి శ్రీనివాస రావు, వెంకటరావు, బైరెడ్డి గురప్పు, పి రెడ్డి, ఐద్వా జిల్లా కార్యదర్శి సత్యవతి, సంతోషం, కణితి అప్పలరాజు పాల్గొన్నారు.

వసతి, భోజన సౌకర్యాలపై విద్యార్థుల గగ్గోలు

కాలేజీ యాజమాన్యంతో మాట్లాడుతున్న సిఐ, సిఐటియు నేత

ప్రజాశక్తి-మధురవాడ: తమకు సరైన వసతి, భోజన సౌకర్యాలు లేవని మారికవలస మెట్రోమాల్ సమీపంలోని చైతన్య కళాశాల విద్యార్థులు గగ్గోలు పెడుతున్నారు. ఆదివారం చీటీలు రాసి, పోలీసులకు పంపడంతోపాటు, తమను రక్షించాలంటూ కిటికీల్లోంచి అరుపులు, కేకలు వేస్తూ వేడుకున్నారు. విషయం తెలిసిన వెంటనే స్థానిక సిఐటియు నాయకుడు రాజకుమార్ కళాశాలకు వెళ్లి విద్యార్థులతో పాటు పోలీసులతో మాట్లాడారు. ఈ సందర్భంగా తమకు సరైన ఆహారం, వసతి, వైద్యసదుపాయాలు లేవని విద్యార్థులంతా రాజ్‌కుమార్‌కు విన్నవించారు. అనారోగ్యం వస్తే కనీసం ఆసుపత్రికి తీసుకెళ్లే నాధులే లేకుండా పోయారని వాపోయారు. దీనిపై సిఐటియు నేత రాజ్‌కుమార్ మాట్లాడుతూ, కళాశాల యాజమాన్యం విద్యార్థులకు సరైన సౌకర్యాలను కల్పించకపోగా, తమ సమస్యలను చెప్పుకోవడానికి వీలులేకుండా జైల్లో ఖైదీలుగా బంధించారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు. వైస్‌ప్రిన్సిపల్, వార్డు ఇన్‌చార్జి కొడుతున్నారని భయభయంగా తమ సమస్యలను చెప్పారన్నారు. దీనిపై తగు చర్యలు తీసుకోవాలని రాజ్‌కుమార్ కోరారు. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లనున్నట్లు వెల్లడించారు.

కళావిహీనంగా ఫ్లైఓవర్ కూడలి పార్కు

పిచ్చిమొక్కలతో అధ్వానం : నిర్వహణను పట్టించుకోని పంచాయతీ, అధికారులు

పిచ్చిమొక్కలతో నిండిఉన్న ఆనందపురం ఫ్లైఓవర్ కూడలిపార్క్

ప్రజాశక్తి- ఆనందపురం: ఆనందపురం ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద ఏర్పాటుచేసిన పార్కు స్థలంలో పిచ్చి మొక్కలు పెరిగిపోవడంతో అధ్వానంగా తయారైంది. ఆనందపురం పూల మార్కెట్‌కు నిత్యం వందలాది మంది రైతులు, వ్యాపారస్తులు, కొనుగోలుదారులతోపాటు ముఖ్యకూడలి కావడంతో అధికసంఖ్యలో విద్యార్థులు, ప్రయాణికులు రాకపోకల సాగిస్తుంటారు. వీరంతా కాసేపు సేదదీరేందుకు, ఆహ్లాదం కలిగించేందుకు ఉపయోగపడుతుందనే ఉద్దేశ్యంతో పార్కును ఏర్పాటు చేశారు. అయితే స్థానిక పంచాయతీ అధికారులుగానీ, హైవే అధికారులుగానీ, పార్కు నిర్వహణను పట్టించుకోకపోవడంతో పిచ్చిమొక్కలు పెరిగి కళావిహీనంగా తయారైంది. ఇక్కడ పార్కింగ్ స్థలంలోనూ పిచ్చి మొక్కలు పేరుకుపోవడంతో ఈగలు, దోమలకు ఆవాసంగా మారి ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం రద్దీగా ఉండే ఈకూడలిలో పార్కును ఆధునీకరించి, సుందరవనంగా అభివృద్ధి చేయాలని పలువురు కోరుతున్నారు.

జిప్సా నూతన కార్యవర్గం ఎన్నిక

నూతనంగా ఎన్నికైన జిప్సా కార్యవర్గ ప్రతినిధులు

ప్రజాశక్తి - గాజువాక : గాజువాక ఇండస్ట్రియల్ ప్రయివేటు స్కూల్స్ అసోసియేషన్ (జిప్సా) నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా గిరీష్ విద్యానికేతన్‌కరస్పాండెంట్ బి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా ప్రగతి స్కూల్ కరస్పాండెంట్ ఎస్ షణ్ముఖరావు, కోశాధికారిగా బాలవికాస్ స్కూల్ ఎం.బాబూరావు ఎన్నికయ్యారు. సంబంధిత నియామక పత్రాలను పి ప్రభాకర్, డి రాఘవ రాజు, ఎం.జగ్గారావు అందజేశారు. గౌరవాధ్యక్షులుగా పాలవలస భాస్కరరావు, ఆర్ శోభన్‌బాబు, సలహా దారులుగా పి.మురళీసుందర్, ఎం.జగ్గారావు, బి శ్రీధర్, జి జగన్, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా ఎ.రాము, జి.కుమార్, పలువురు ఉపాధ్యక్షులు, సహాయ కార్యదర్శులు, సహాయ కోశాధికారులు, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో పి.వాసుదేవరావు, బ్యూలా గిరి, సత్య న్నారాయణ, రమేష్ నాయుడు, రవికుమార్, కృష్ణం నాయుడు, మౌళి, నాయుడు, శ్రీనివాస్, లక్ష్మణరావు, వివిధ పాఠశాలలనుంచి 100మంది కరస్పాండెంట్స్ పాల్గొన్నారు.

సుదర్శన యాగంలో పాల్గొన్న సిపి

ప్రజాశక్తి - ఆరిలోవ : నగరంలోని ఆరిలోవ ఎన్ని దుర్గమాంబ ఆలయ ప్రాంగణంలో సుదర్శన యాగంలో ఆదివారం నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సిపిని బాలబాను అర్చక,పురోహిత సంఘం అధ్యక్ష కార్యదర్శులు జోస్యుల కామేశ్వరశర్మ, మావుడూరు కిషోర్‌కుమార్ శర్మ, వ్యవస్థాపకులు వెంకటరమణ శర్మ సత్కరించారు.

సిఆర్ఎంటిల ఉద్యోగ భద్రత ప్రశ్నార్థకం

- పాఠశాల సముదాయాలను కుదిస్తున్న ప్రభుత్వం
- 12 సంవత్సరాలుగా విధుల నిర్వహణ
- క్లస్టర్ల కుదింపు సిఆర్ఎంటి/ సిఆర్పిలపై స్పష్టత ఇవ్వని విద్యాశాఖ
- ఆందోళన చెందుతున్న ఉద్యోగులు

లెక్కలు పాఠాలు బోధిస్తున్న సిఆర్ఎంటి (ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి-అనకాపల్లి

జాతీయ విద్యా విధానం 2020 అమలులో భాగంగా రాష్ట్రంలో అన్ని జిల్లాల్లోని పాఠశాల సముదాయాల (సిఆర్సీలు)ను కుదిస్తున్న నేపథ్యంలో సమగ్ర శిక్ష అభియాన్‌లో పనిచేస్తున్న క్లస్టర్ రిజర్వ్ మొబైల్ టీచర్ (సిఆర్ఎంటి)ల ఉద్యోగ భద్రతపై ఆందోళన నెలకొంది.

ప్రతి జిల్లాలోని స్కూల్ కాంప్లెక్స్ పరిధిలో సిఆర్‌పిలు వివిధ రకాల విధులు నిర్వహిస్తున్నారు. వీరంతా క్లస్టర్ ప్రాతిపదికన బీఈడీ విద్యార్హతతో రోస్టర్ విధానంలో ఉద్యోగాలు తెచ్చుకున్నారు. 12 సంవత్సరాలుగా వీరు విధులు నిర్వహిస్తున్నారు. గత ప్రభుత్వం సింగల్ టీచర్ స్కూళ్లలో పని చేసే ఉపాధ్యాయుడు సెలవు పెడితే ఆ పాఠశాలలు మూతపడకుండా ప్రత్యామ్నాయంగా బీఈడీ విద్యార్హత ఉన్న సిఆర్‌పిలు ఆ విధులు నిర్వహించే విధంగా జిఓ నెంబరు 65ని తీసుకొచ్చింది. దీని ప్రకారం నాటి విద్యాశాఖ కమిషనర్ ప్రవీణ్ ప్రకాష్ సిఆర్‌పిలను క్లస్టర్ రిజర్వ్ మొబైల్ టీచర్స్ (సిఆర్ఎంటి)గా మార్పు చేశారు.

అయితే ప్రస్తుత ప్రభుత్వంలో డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని విద్యాశాఖలో కీలక అంశమైన పాఠశాల సముదాయాలను పునర్ వ్యవస్థీకరణ చేస్తూ అన్ని జిల్లాలలో పాఠశాల సముదాయాలను కుదిస్తున్నారు. అయితే క్లస్టర్లను కుదించిన సిఆర్ఎంటి/సిఆర్‌పి పట్ల విద్యాశాఖ నుంచి సరైన స్పష్టత రాలేదు. దీంతో సిఆర్ఎంటి, సిఆర్‌పిలు తమ ఉద్యోగ భద్రతపై తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా మహిళా ఉద్యోగులు కన్నీరు పెట్టుకున్న సందర్భాలు ఉన్నాయని ఎస్ఎస్ఎ జిల్లా గౌరవ అధ్యక్షులు, ఎపి సిఆర్ఎంటి ఉద్యోగుల హక్కుల సాధన సమితి నాయకుడు పూడి వెంకటరావు తెలిపారు. 12 సంవత్సరాల నుంచి అతి తక్కువ వేతనంతో విద్యాశాఖ సమగ్ర శిక్షలో పని చేస్తున్న వీరంతా ప్రభుత్వాలు ఎప్పటికైనా రెగ్యులర్ చేసి ఉద్యోగ భద్రత కల్పిస్తాయని ఆశతో ఎదురుచూస్తున్నారు. ఇటువంటి సమయంలో క్లస్టర్ రిసోర్స్ సెంటర్లను రీ ఆర్గనైజేషన్ చేసి పాఠశాల సముదాయ కేంద్రాలను కుదింపు నిర్ణయంతో తమ ఉద్యోగాలు ఏమవుతాయోనని వీరిలో భయాందోళన నెలకొంది. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం సిఆర్ఎంటిల ఉద్యోగ భద్రతపై సరైన స్పష్టత ఇవ్వాలని, తమను క్రమబద్ధీకరించి, ఉద్యోగ భద్రత కల్పించాలని వారు కోరుతున్నారు.

విద్యాశాఖ స్పష్టత ఇవ్వాలి

డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ పాఠశాలల సముదాయాలను కుదిస్తోంది. దీనివలన పలు పాఠశాలలు మూతపడడంతో మా ఉద్యోగ భద్రత పట్ల భయాందోళనకు గురవుతున్నాం. ప్రభుత్వం, విద్యాశాఖ దీనిపై స్పష్టత ఇవ్వాలని కోరుతున్నాం.

- పూడి వెంకటరావు
ఎపి సమగ్ర శిక్ష ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ
అనకాపల్లి జిల్లా గౌరవాధ్యక్షులు.

సిఆర్ఎంటిలను క్రమబద్ధీకరించాలి

12 సంవత్సరాలుగా అతి తక్కువ వేతనాలతో సిఆర్ఎంటిలుగా పని చేస్తున్నాం. క్లస్టర్ సెంటర్ రీ ఆర్గనైజేషన్ ద్వారా మా ఉద్యోగాల పరిస్థితిపై ఉద్యోగుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. మా ఉద్యోగాలను పర్మినెంట్ చేస్తారని ఆశతో ఎదురుచూస్తున్నాం. ఇప్పుడు క్లస్టర్ సెంటర్ రీ ఆర్గనైజేషన్‌తో మా ఉద్యోగ భద్రతపై ఆందోళన నెలకొంది. ప్రభుత్వం తక్షణమే మా ఉదోగ్యాలను క్రమమద్ధీకరించాలి.

- తట్టా కృష్ణ (ఎమ్ఐఎస్)
ఎపి సమగ్ర శిక్ష ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ
అనకాపల్లి జిల్లా అధ్యక్షులు

ఇవీ సిఆర్ఎంటిల విధులు..

విద్యా శాఖ కార్యక్రమాల్లో సిఆర్ఎంటిల పాత్ర కీలకం. మండలంలో ఏకోపాధ్యాయ పాఠశాలల్లో పనిచేస్తున్న టీచర్లు సెలవు పెడితే వారి స్థానాల్లో సిఆర్ఎంటీలు డిపుటేషన్‌పై వెళ్లి విద్యార్థులకు పాఠాలు బోధించడం వీరి ప్రాథమిక విధి. స్కూల్ డిపుటేషన్ లేని రోజుల్లో మండల విద్యాశాఖ కార్యాలయాల్లో విధులు నిర్వహిస్తారు. ఇందులో...

- బడి బయట విద్యార్థులను గుర్తించి, వారిని తిరిగి పాఠశాలలో చేర్పించడం
- ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, స్టూడెంట్ కిట్లు అందేలా చూడటం
- స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను సమర్థవంతంగా నిర్వహించడానికి సహకరించడం
- యూ డైస్ ప్లస్ సైట్‌లో విద్యార్థుల వివరాలు నమోదు చేయించడం
- విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం నిర్వహణకు అన్ని సరుకులు అందుతున్నాయో లేదో చూడడం
- మధ్యాహ్న భోజన పథక వివరాలు ఐఎంఎంఎస్ యాప్‌లో ప్రధానోపాధ్యాయులు నమోదు చేసే విధంగా చూడడం
- స్కూల్ అటెండెన్స్ యాప్‌లో ఉపాధ్యాయులు బయోమెట్రిక్ పూర్తిస్థాయిలో అమలయ్యే విధంగా చూడటం
- విద్యార్థుల హాజరును స్కూల్ అటెండెన్స్ యాప్‌లో నమోదు చేస్తున్నారో లేదో పరిశీలించడం

టీచ్ టూల్‌లో భాగంగా క్లస్టర్ పరిధిలో ఉన్న ప్రైమరీ స్కూల్ ఉపాధ్యాయుల టీచింగ్ పాయింట్లను గుర్తించి టీచ్ టూల్ యాప్‌లో కోడింగ్ చేయడం

- పాఠశాల, మండల స్థాయిలలో సైన్స్ ఫేర్ వంటి కార్యక్రమాల నిర్వహణకు సహకరించడం
- విద్యార్థులకు వివిధ రకాల పోటీలు పాఠశాల, మండల స్థాయిలో నిర్వహించే విధంగా చూడడం
- ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలో రక్తహీనత తక్కువగా ఉన్న విద్యార్థులకు ఐరన్ మాత్రలు అందే విధంగా చర్యలు తీసుకోవడం
- పాఠశాలలో నిర్వహించే వివిధ రకాల సివిల్స్ వర్క్స్ పనులను పరిశీలించి నివేదిక మండల, జిల్లా అధికారులకు సమర్పించడం
- కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న వివిధ రకాల కార్యక్రమాలు పాఠశాలలలో అమలు జరిగే విధంగా చర్యలు తీసుకోవడం

పైప్‌లైన్ లీకేజీని అరికట్టాలి

ప్రజాశక్తి- అనకాపల్లి

అనకాపల్లి మండలం ఊడేరు గ్రామంలో పైపులైన్ లీకేజీని అరికట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు. గ్రామంలో ఆంజనేయస్వామి గుడి వద్ద నుండి రామాలయం వరకు రోడ్డుపై వర్షం పడకపోయినా ఇళ్లల్లో వాడుక నీరు, మంచినీటి పైప్ లైన్ లీకేజీ నీరు కలిపి నిత్యం ప్రవహిస్తుంది. గోతులో నీరు నిల్వ ఉండి చెరువును తలపించేలా మారింది. దీంతో ఈ రోడ్డుపై నడిచేందుకు పజలు చాలా ఇబ్బంది పడుతున్నారు. నీరు రోడ్డుపై ఎక్కువ నిల్వ ఉండటం వలన దోమలు ఎక్కువై గ్రామంలో ప్రజలు తరచూ జ్వరాలతో బాధపడుతున్నారు. దీనిపై అధికారులు స్పందించి తక్షణమే పైప్‌లైన్ లీకేజీని అరికట్టాలని, నీరు నిల్వ లేకుండా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

రోడ్డుపై నిలిచిపోయిన నీరు

పలు చోట్ల 'స్వచ్ఛతా హీ సేవా'

విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న పోర్టు అధికారులు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ

జాతీయ స్థాయి స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా విశాఖపట్నం పోర్టు అథారిటీ ఆదివారం కంబాలకొండ ట్రెక్కింగ్ మార్గంలో శుభ్రతా కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ కార్యక్రమంలో పోర్ట్ సిబ్బంది, క్రీడా విభాగం, వివిధ క్రీడా పాఠశాలల విద్యార్థులు, జిల్లా అటవీశాఖ సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. క్రీడా పాఠశాలల విద్యార్థులు, పోర్టు అటవీ శాఖల సిబ్బంది కలిసి చెత్త తొలగించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారికి గుర్తింపుగా విశాఖపట్నం పోర్టు అథారిటీ విభాగాధిపతులు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో పోర్టు కార్యదర్శి టి.వేణుగోపాల్, సిఎంఇ హరికృష్ణ, ఇతర విభాగాధిపతులు పాల్గొన్నారు.

ఆనందపురం : మండలంలో గొట్టిపల్లి పంచాయతీ వెంకటాపురం గ్రామంలో స్వచ్ఛత హి సేవ కార్యక్రమం నిర్వహించారు.స్వచ్ఛ ఆంధ్రమిషన్ ద్వారా స్వచ్ఛభారత్‌కు సహకరిస్తామని ప్రతిజ్ఞ చేశారు. ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సురేష్‌బాబు వెల్ఫేర్ అసిస్టెంట్ చిట్టిబాబు, తాడివాడ ప్రశాంత్ కుమార్, శ్రీరామ్, శివ, మహంతి రమణ, మహిళలు పాల్గొన్నారు.

అనకాపల్లి : పరిసరాల పరిశుభ్రతపై ప్రతి ఒక్కరూ దృష్టి సారించాలని లీడ్ బ్యాంకు మేనేజర్ కె.సత్యనారాయణ అన్నారు. స్వచ్ఛత హీ సేవ - 2024 కార్యక్రమంలో భాగంగా ఆదివారం యూనియన్ బ్యాంక్ అధికారులు, సిబ్బంది అనకాపల్లి ఎన్టీఆర్ మార్కెట్ యార్డు రోడ్లను క్లీన్ చేసి పరిశుభ్రత చర్యలు చేపట్టారు. చెత్తను తొలగించే కార్యక్రమాలు చేశారు. అనంతరం పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్ఐ శ్రీనివాసరావు, వినోద్‌బాలు

రక్తదాన శిబిరం పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట

అమ్మ హెల్పింగ్ హార్ట్స్ ఆధ్వర్యంలో గాంధీ జయంతి సందర్భంగా వడ్డాదిలో ఏర్పాటు నిర్వహించే రక్తదానంపై అవగాహన పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం ఆదివారం రాత్రి బుచ్చయ్యపేట చెరుకు కాటా వద్ద జరిగింది. రక్తదాన చైతన్య కర్త వినోద్ బాలు, స్థానిక ఎస్ఐ శ్రీనివాసరావు పోస్టర్లను ఆవిష్కరించి యువతకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ సుంకర లక్ష్మి, దిబ్బిడి సర్పంచ్ పేదిరెడ్ల మాణిక్యం, డొంకిన అప్పలనాయుడు, బుచ్చయ్యపేట, దిబ్బిడి, నేతవానిపాలెం గ్రామాల యువకులు పాల్గొన్నారు.

మాజీ కౌన్సిలర్ బొలిశెట్టికి మాతృవియోగం

ప్రజాశక్తి -అనకాపల్లి : తెలుగుదేశం పార్టీ అనకాపల్లి జిల్లా పోల్ మేనేజ్మెంట్ కన్వీనర్, మాజీ కౌన్సిలర్ బొలిశెట్టి శ్రీనివాసరావు తల్లి సంజీవమ్మ శనివారం రాత్రి వారి స్వగృహంలో మృతి చెందారు. విషయం తెలుసుకొని శాసనమండలి మాజీ సభ్యులు బుద్ధ నాగ జగదీశ్వరరావు శ్రీనివాసరావు స్వగృహానికి వెళ్లి సంజీవమ్మ మృత దేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. సంజీవమ్మకు నివాళు లర్పించిన వారిలో టిడిపి నాయకులు కోట్ని రామకృష్ణ, కుప్పిలి జగన్, బొడ్డేడ మురళి, కర్రి మల్లేశ్వరరావు ఉన్నారు.

ఈ-శ్రమ కార్డుదారులకు ప్రమాద బీమా

ప్రజాశక్తి-చోడవరం : ఈ-శ్రమ కార్డు కలిగి ఉండి మాదవశాత్తు మరణించిన కార్మికులకు కేంద్ర ప్రభుత్వం రెండు లక్షల రూపాయల ప్రమాద బీమా అందిస్తుందని చోడవరం కార్మిక శాఖ అధికారి పి సూర్యనారాయణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2022 మార్చి 31వ తేదీ లోగా ప్రమాదవశాత్తు మరణించిన కార్మికులు ఈ ఏడాది డిసెంబర్ 31వ తేదీ లోపు తమ కార్యాలయానికి ఆధారాలు అందజేయాలని కోరారు. తదుపరి మృతుని సంబంధీకుల బ్యాంక్ అకౌంట్లో రెండు లక్షల రూపాయలు జమవుతాయని పేర్కొన్నారు. ఈ-శ్రమ కార్డులు కావలసినవారు సచివాలయాల్లోగాని, మీసేవలోగాని దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

శ్రీకృష్ణ యోగా సెంటర్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి మండలం తుమ్మపాల శ్రీకృష్ణ యోగ సెంటర్ విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి అనేక బహుమతులను కైవసం చేసుకున్నారు. బెంగళూరు ఆదిత్య సాయి యోగా సెంటర్, శివజ్యోతి యోగ కేంద్ర ఓం యోగ అండ్ హెల్త్ ఫౌండేషన్ సంయుక్తంగా కర్ణాటక రాష్ట్రం బికేఎస్ అయ్యంగార్ మెమోరియల్ ఎనిమిదవ జాతీయస్థాయి ఓపెన్ యోగ చాంపియన్షిప్ 2024 ఆన్లైన్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో రెండు సంవత్సరాల 5, 6 సంవత్సరాల విభాగంలో టీ షణ్ముఖ, ఎస్ వికాస్ కుమార్, 12 నుంచి 15 సంవత్సరాల క్యాటగిరిలో బి జయశ్రీ ప్రథమ స్థానం, ద్వితీయ తృతీయ స్థానాలను జి విశ్వశ్రీ, ఎన్ హేమ వెంకట్ సాధించారు. 15 నుంచి 20 సంవత్సరాల కేటగిరీలో ఎం కునాల్ తృతీయ స్థానం, 20 నుంచి 25 సంవత్సరాల కేటగిరీలో బి హేమ తృతీయ స్థానం, 50 నుంచి 60 సంవత్సరాల కేటగిరీలో బుదిరెడ్డి నరసింగరావు, బి నాగమణి, లక్ష్మి, సిహెచ్ పుష్ప వరుసగా ప్రథమ ద్వితీయ, నాలుగు, ఐదు స్థానాలను కైవసం చేసుకున్నారు. వీరితోపాటు మరో 11 మందికి కన్సోలేషన్ బహుమతులు దక్కాయి. బెస్ట్ యోగ టీచర్ అవార్డును యోగ సెంటర్ టీచర్ బుదిరెడ్డి నరసింగరావు దక్కించుకున్నారు. వీరిని గ్రామ మాజీ సర్పంచ్ కర్రి వెంకట సన్యాసినాయుడు (బాబి), ఎంపిటిసి పన్నీరు వెంకటలక్ష్మి చంటి, స్థానిక నాయకులు మార్టూరు అజయ్, నడిపల్లి బోసుబాబు, బుదిరెడ్డి సూరిబాబు, గొంతిన వెంకట్రావు, గొంతిన శ్రీను, నానుబిల్లి నాగేశ్వరరావు తదితరులు సత్కరించారు.

బహుమతులు పొందిన విద్యార్థులతో సంస్థ నిర్వాహకులు, పెద్దలు

ప్రజల హక్కుల రక్షణకు కృషి

ప్రజాశక్తి-అనకాపల్లి

మానవ హక్కుల కమిషన్ ప్రజల హక్కుల రక్షణే ధ్యేయంగా పనిచేస్తుందని ఆ కమిషన్ రాష్ట్ర అధ్యక్షుడు మంత్రి శ్యామ్ ప్రసాద్ అన్నారు. స్థానిక జార్జి క్లబ్ సమావేశ మందిరంలో ఆదివారం మానవ హక్కుల కమిషన్ కౌన్సిల్ సమీక్ష సమావేశం కమిషన్ సభ్యులు మల్ల సన్యాసినాయుడు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా శ్యామ్ ప్రసాద్ మాట్లాడుతూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు కమిషన్ సభ్యులు పనిచేయాలన్నారు. గ్రామస్థాయిలో ప్రజలకు మానవ హక్కులపై అవగాహన కల్పించటం జరుగుతుందని, మానవ హక్కులకు భంగం కలగకుండా తీసుకోవలసిన జాగ్రత్తలను వివరిస్తామని చెప్పారు. త్వరలో అనకాపల్లిలో శిక్షణ తరగతులు ఏర్పాటు చేస్తామన్నారు. అక్టోబర్ 2న ప్రభుత్వ ఆసుపత్రిలో పేదలకు రోగులకు గర్భిణీలకు పండ్లు పంపిణీ చేస్తామని తెలిపారు. విశాఖపట్నం అల్లూరి విజ్ఞాన భవన్లో అక్టోబర్ 22న సదస్సు ఏర్పాటు చేశామని తెలిపారు. రాష్ట్ర కమిటీ సభ్యులు ఎస్వీ రమణ మాట్లాడుతూ మానవ హక్కుల ఉల్లంఘన పై ఎవరికి ఇబ్బందులు వచ్చినా తనను ఏ సందర్భంలోనైనా సంప్రదించవచ్చని చెప్పారు. సభ్యత్వం తీసుకున్న వారికి సభ్యత్వం కార్డులను అందజేశారు. కమిషన్ సూత్రాలకు మార్గదర్శకాలకు అనుగుణంగా పనిచేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో మల్ల సన్యాసినాయుడు, దేవి, సందీప్, లత, అనకాపల్లి, చోడవరం, ఎలమంచిలి, నర్సీపట్నం, పాడేరు, అరకు ప్రాంతాలకు చెందిన కమిషన్ సభ్యులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న శ్యాం ప్రసాద్

ధర్నా చేస్తున్న బాధిత కుటుంబ సభ్యులు , స్థానికులు

4వ రోజు కొనసాగిన ధర్నా

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : మృతి చెందిన షిఫ్ట్ ఆపరేటర్ కుటుంబ సభ్యులకు ఆ ఉద్యోగం ఇవ్వాలని కోరుతూ బుచ్చయపేట మండలం రాజాం విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద మృతుని కుటుంబ సభ్యులు, స్థానికులు నిర్వహిస్తున్న ధర్నా ఆదివారం నాలుగవ రోజు కొనసాగింది. ఈ సందర్భంగా మృతుని భార్య రామలక్ష్మి మాట్లాడుతూ తన భర్త రొంగలి నర్సింగరావు 9 సంవత్సరాల పాటు షిఫ్ట్ ఆపరేటర్గా విధులు నిర్వహించి అనారోగ్యంతో మృతి చెందారని, దీంతో తమ కుటుంబం రోడ్డున పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ ఉద్యోగం తమ కుటుంబానికి కాకుండా వేరొకరికి ఇవ్వడం సరికాదని, తమ కుటుంబ సభ్యులకు ఆ ఉద్యోగం ఇచ్చి తమను ఆదుకోవాలని కోరారు.

ప్రస్తుతం ఉన్న మట్టి రహదారి

తారు రోడ్డు నిర్మించరూ..

ప్రజాశక్తి-కె.కోటపాడు : మండలంలోని గుల్లేపల్లి దుర్గాదేవి గుడి నుండి పైడంపేట జంక్షన్ వరకు తారు రోడ్డు నిర్మించాలని రెండు గ్రామాల ప్రజలు కోరుతున్నారు. పైడంపేటకు వెళ్లాలంటే గుల్లిపల్లి నుండి చౌడువాడ వెళ్లి అక్కడి నుండి వెళ్లవలసి వస్తోంది. దీని వల్ల దూరం ఎక్కువ కావడంతో పాటు డబ్బు కూడా వృథా అవుతోంది. ప్రస్తుతం ఉన్న సుమారు రెండు కిలోమీటర్ల రోడ్డుపై చెరకు, ఇతర వ్యవసాయ ఉత్పత్తులు తరలించేందుకు రైతులు అష్ట కష్టాలు పడుతున్నారు. మట్టి రోడ్డు కావడంతో వర్షాల సమయంలో ఈ రోడ్డుపై ప్రయాణించాలంటే రైతులు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ మట్టి దారిని పక్కా రోడ్డుగా నిర్మిస్తే అటు గవరవరం, చోడవరం వెళ్లడానికి, ఇటు పైడంపేటకు వెళ్లేందుకు దగ్గరి దారి అవుతుంది. ప్రజాప్రతినిధులు స్పందించి గుల్లేపల్లి దుర్గాదేవి గుడి నుండి పైడంపేట జంక్షన్ వరకు తారు రోడ్డు సౌకర్యం కల్పించాలని రెండు గ్రామాల ప్రజలు కోరుతున్నారు

పోటీతత్వాన్ని పెంచుకోవాలి

ప్రజాశక్తి -తగరపువలస : విద్యార్థులు పోటీతత్వాన్ని పెంచుకోవాలని భీమిలి ట్రాఫిక్ ఎస్ఐ చిరంజీవి సూచించారు .ఫ్రెండ్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో చిట్టివలస జెడ్పి బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న ఎన్ఎంఎంఎస్ ఉచిత శిక్షణా తరగతులలో పాల్గొని, పలు అంశాలపై అవగాహన కల్పించారు. తల్లిదండ్రుల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా కష్టపడి, ఇష్టపడి చదివి ఉన్నత స్థాయికి వెళ్ళాలని కోరారుఉచిత శిక్షణ ఇస్తున్న ఫ్రెండ్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ నిర్వాహకులను అభినందించారు.నేపాల్లో జరిగిన జాతీయ స్థాయి కిక్ బాక్సింగ్ పోటీల్లో బంగారు పతకం సాధించిన విద్యార్థిని సరగడ ఆదిలక్ష్మిని ఎస్ఐ చిరంజీవి, ఫ్రెండ్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ నిర్వాహకులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షులు గంటాన మోహనరావు, ప్రధాన కార్యదర్శి రేఖ అప్పారావు, ఉపాధ్యాయులు దత్తి రవి, జగన్, పక్కి నాగేశ్వరరావు, భరత్ పాల్గొన్నారు

మాట్లాడుతున్న ఎస్ఐ చిరంజీవి

చట్టాల అమలులో అలసత్వంతో వివక్ష

ప్రజాశక్తి-సీతమ్మధార

ఎస్సి, ఎస్టి అట్రాసిటీ నిరోధకచట్టంతోపాటు పటిష్టచట్టాలు ఉన్నప్పటికీ అవి సక్రమంగా అమలు కాకపోవడం వల్లే దళితులపై ఆగడాలు, వివక్ష కొనసాగుతోందని న్యాయవాది ఎన్.హెచ్. అక్బర్ అన్నారు. ఆదివారం పౌర గ్రంథాలయంలో భీమసేన వార్ ఆధ్వర్యంలో షెడ్యూల్ జాతులు తెగల అత్యాచార నిరోధక చట్టం 1989పై సదస్సు నిర్వహించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ, కేసు దర్యాప్తులో జాప్యం, తక్కువ శిక్ష రేటు ఉండడం వల్లే బలమైన చట్టాలున్నా, సరైన ఫలితాలు రావడం లేదన్నారు. పాయకరావుపేట మండలంలో వడ్లమూడి నాగేంద్ర హత్య కేసు అధ్యయన నివేదికపై బడుగు దుర్గాబాబు మాట్లాడారు ఇటీవలే ఉద్యోగ విరమణ చేసిన చింతకాయల రాంజీని సత్కరించారు అనంతరం అసోసియేషన్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు ముందుగా అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు ఎస్సార్ వేమన. అధ్యక్షుడు కె.చిన్నారావు కోశాధికారి వసంత రాజేంద్రప్రసాద్, కార్యదర్శి బి కనకరాజు పాల్గొన్నారు

ఏ స్థాయిలో ఉన్నా కొనసాగుతున్న కులవివక్ష

దళితులు ఏ స్థానంలో ఉన్నా వారికి కుల వివక్షత కొనసాగుతోందనిభీమసేన వ్యవస్థాపకులు రవి సిద్ధార్థ అన్నారు అంబేద్కర్ భవనంలో విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రపతి నుంచి కిందిస్థాయి వరకు దళితులపై వివక్ష ఉండడం హేయమన్నారు. విశాఖ రేంజ్, నగర పరిధిలో పోలీసుల పోస్టింగ్లో దళిత ఇన్స్పెక్టర్లు అనేకమందిని రిజర్వ్లో ఉంచడం దీనికి నిదర్శనమన్నారు. దీనిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు.

ఆయుర్వేద మందులు అందిస్తున్న నిర్వాహకులు

ఆయుర్వేద వైద్య శిబిరానికి స్పందన

ప్రజాశక్తి-రాంబిల్లి

మండలంలోని అప్పన్నపాలెం కాలనీ సమీపంలో టెంట్ హౌస్ అప్పారావు కిరాణా షాపు వద్ద ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత మెగా ఆయుర్వేద వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. శెట్టి అప్పారావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో ప్రముఖ ఆయుర్వేద డాక్టర్ కమలాకర్ పురపండ, డాక్టర్ హేమంత్ కుమార్, డాక్టర్ వివి మాధురి, దిమిలి పిహెచ్సి ఆరోగ్య పర్యవేక్షణాధికారి సిహెచ్.ధనరాజ రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఒళ్ళు, కీళ్ల నొప్పులు, పక్షవాతం చర్మ సమస్యలు, నరహాల బలహీనత, ఫైల్స్, స్త్రీ సమస్యలు, దీర్ఘకాలిక సమస్యల ఉన్న సుమారు 150 మంది రోగులను పరీక్షించి మందులు ఉచితంగా పంపిణీ చేశారు. రోగులకు ఆరోగ్య సలహాలు తెలియజేశారు. ఈ సందర్భంగా శిబిరం నిర్వహించిన అప్పారావుకు రోగులు కృతజ్ఞతలు తెలిపారు.

రోడ్డు ప్రమాద బాధితునికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-కె.కోటపాడు : ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి విశాఖపట్నం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న స్థానిక రెల్లివీధికి చెందిన సిహెచ్ అప్పారావు కుటుంబ సభ్యులకు వైద్య ఖర్చుల నిమిత్తం స్థానిక బిజెపి నాయకురాలు పైలా అమ్మాజీ రూ.5000 ఆర్థిక సాయం అందించారు. పేద కుటుంబానికి చెందిన అప్పారావు వైద్యానికి ఆర్థిక సహాయం అందించాలని స్థానిక రెళ్ళ సంఘం నాయకులు కోరగా ఆమె స్పందించి ఆ మొత్తం అందించారు.

వందరోజుల పాలనపై ఇంటింటి ప్రచారం

కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కొణతాల తదితరులు

ప్రజాశక్తి-కశింకోట

రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు పూర్తయిన సందర్భంగా ప్రభుత్వ నిర్వహిస్తున్న 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని మండలంలో నర్సింగబిల్లి గ్రామంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం పంచాయతీ నిధులను దారిమళ్లించి గ్రామాలను అంధకారంలోకి నెట్టారని ఆరోపించారు. అనంతరం కర పత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పీలా గోవిందసత్యనారాయణ, నాయకులు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

కె.కోటపాడు : మండలంలోని కె.సంతపాలెంలో ఎంపీడీవో ఎస్.అప్పలరాజు ఆధ్వర్యాన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. సచివాలయ సిబ్బంది ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. అనంతరం స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో ఎంపిడిఒ పాల్గొన్నారు. 23న మాడుగులలో ఏర్పాటు చేస్తున్న వైద్య శిబిరంలో అన్ని రకాల స్పెషలిస్ట్ వైద్యులు పాల్గొంటారని, ఆ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

దేవరాపల్లి : మండలంలోని ఎన్.గజపతినగరం, వేచలం గ్రామాల్లో ఆదివారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో పాల్గొన్న మాడుగుల శాసనసభ్యులు బండారు సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ నియోజకవర్గంలో అధ్వానంగా ఉన్న రోడ్ల, గ్రామాల్లో డ్రైనేజ్ వ్యవస్థను మెరుగుపర్చుతామని చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, టిడిపి నాయకులు పైలా ప్రసాదరావు, చిటిమిరెడ్డి సూర్యనారాయణ, కిలపర్తి భాస్కరరావు, బలరాం కొమర బాబూరావు, సోమిరెడ్డి గోవింద, చల్ల నానాజీ, సర్పంచ్ సిరికి లక్ష్మి ఎంపీటీసీ రెడ్డి లక్ష్మి, మండల స్థాయి అధికారులు, కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు.

అచ్యుతాపురం : ప్రజా సంక్షేమమే పరమావధిగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ అన్నారు. ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం మండలంలోని కొండకర్ల గ్రామంలో ఆదివారం సాయంత్రం నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పి మాజీ చైర్పర్సన్ లాలం భవాని, కూటమి నాయకులు ప్రగడ నాగేశ్వరరావు, రాజాన రమేష్ కుమార్, బి రాందాస్, రాజాన సన్యాసినాయుడు, గొంతున భక్త సాయిరాం పాల్గొన్నారు.

మధురవాడ : కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ ఒక్కటొక్కటిగా నెరవేరుస్తున్నామని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. 8వవార్డు ఎండాడ వరాహగిరి కాలనీలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. వందరోజుల్లో కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలను వివరించారు. వైసిపి అక్రమాలపై ధ్వజమెత్తారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ లోడగల అప్పారావు, కోరాడ రాజబాబు, పంచకర్ల సందీప్, చెట్టుపల్లి గోపి, శాఖరి శ్రీనుబాబు, జెడిసి పి.సింహాచలం పాల్గొన్నారు.

ములగాడ : జివిఎంసి 62వ వార్డు త్రినాధపురం జంక్షన్లో వార్డు అధ్యక్షులు మజ్జి మాలి నాయుడు ఆధ్వర్యంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు పాల్గొన్నారు. కూటమి నాయకులు దప్పు సన్యాసిరావు, అధికారులు, కూటమి శ్రేణులు పాల్గొన్నారు.

భీమునిపట్నం : మూడోవార్డు స్మిత్ వీధిలో 'ఇది మంచి ప్రభుత్వం'పై జివిఎంసి జోనల్ అధికారులు ఇంటింటా కరపత్రాలను పంచుతూ ప్రచారం చేశారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ గాడు అప్పలకొండ, జెడిసి పిల్లి ప్రేమప్రసన్న వాణి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు పాల్గొన్నారు

మాట్లాడుతున్న విశాఖ పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు

అన్నదాత సుఖీభవ..

పెట్టుబడి సాయం కోసం ఎదురుచూపు

-అప్పులు చేసి సాగు - ఆవేదనలో రైతులు

ప్రజాశక్తి -కోటవురట్ల: కూటమి ప్రభుత్వం ఏర్పడి 100 రోజులు పూర్తయింది. గత ప్రభుత్వం రైతు భరోసా పేరిట రైతులకు పెట్టుబడి సాయం కింద కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు 13500 చొప్పున అందజేసేవి. కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలో భాగంగా ప్రకటించిన పెట్టుబడి సాయం అన్నదాత సుఖీభవ నేటికీ అందకపోవడంతో రైతన్నలు ఎదురుచూస్తూ ఉన్నారు. దాదాపు ఖరీఫ్ సీజన్ ప్రారంభమై రెండు నెలలు కావస్తోంది. ఏడాదికి రూ.20,000 చొప్పున ఇస్తానన్న ప్రభుత్వం నేటికీ ఆ ఊసే ఎత్త లేదని మండల వైసీపీ అధ్యక్షులు కిల్లాడ శ్రీనివాసరావు తెలిపారు. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం తమ వంతు 2000 రూపాయలు రైతుల ఖాతాలో జమ అయ్యాయని, నేటికీ రాష్ట్ర ప్రభుత్వం పెట్టుబడి సాయం అందక రైతన్నలు అప్పులు చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మండల వ్యాప్తంగా గతంలో రైతు భరోసా పేరిట 10 986 మంది రైతులు లబ్ధి పొందారు. ఇప్పటికే వ్యవసాయ శాఖ సిబ్బంది ఈ క్రాఫ్, ఇకేవైసీ సమాచారం పొందుపరిచి సిద్ధం చేశారు. మండల వ్యాప్తంగా సుమారు 1654 హెక్టార్ల వరి సాగు చేస్తున్నారు.

పెట్టుబడి సాయాన్ని అందించాలి

రైతులకు అందజేయాల్సిన పెట్టుబడి సాయాన్ని ఖరీఫ్ సీజన్లో నేటికీ కూటమి ప్రభుత్వం అందజేయలేదు. దీంతో రైతన్నలు అప్పులు తీసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. మండల వ్యాప్తంగా చిన్న కారు రైతులే సాగు చేసుకుంటూ ప్రభుత్వ సాయం కోసం ఎదురుచూస్తున్నారు. తక్షణమే పెట్టుబడి సాయాన్ని అందించాలి..

కిల్లాడ శ్రీనివాసరావు, వైసిపి మండల అధ్యక్షులు

అంతేకాకుండా కూరగాయలు, అపరాలు, ప్రతి సహా వివిధ వాణిజ్య పంటల సాగు చేస్తున్న రైతులు పెట్టుబడి సాయం కోసం ఎదురుచూస్తున్నారు. దాదాపుగా ఇప్పటికే వరి కలుపుతీత పనులు కొనసాగుతున్నాయి. ఈ సమయంలో పెట్టుబడి కోసం రైతులు అప్పులు చేసుకోవాల్సి వస్తుంది. ప్రభుత్వం స్పందించి రైతులకు ఖరీఫ్ సీజన్లో అందించే సాయాన్ని తక్షణమే విడుదల చేయాలని రైతులు పలు సంఘాల నాయకులు కోరుతున్నారు.

ఏర్పాట్లు చేస్తున్న అధికారులు

నేడు హోం మంత్రి అనిత పర్యటన

ప్రజాశక్తి -ఎస్.రాయవరం : మండలంలోని ధర్మవరం అగ్రహారం గ్రామంలో ఈనెల 23న సోమవారం ఉదయం పది గంటలకు రాష్ట్ర హోంశాఖా మంత్రి వంగలపూడి అనిత పర్యటించనున్నారు. ఈ ఏర్పాట్లను అధికారులు, నాయకులు చేపట్టారు. ఆదివారం ఉదయం ధర్మవరం గ్రామంలో పర్యటించిన అధికారులు సిబ్బందికి పలు సూచనలు చేశారు. కూటమి ప్రభుత్వం వంద రోజులు దాటిన సంధర్భంగా మంచి ప్రభుత్వం కార్యక్రమం చేపట్టింది. హోంమంత్రి ప్రజలతో మమేకమయ్యే విధంగా చర్యలు చేపడుతున్నట్లు టిడిపి మండల శాఖ అధ్యక్షుడు అమలకంటి అబద్ధం తెలిపారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటి కలెక్టర్, ఇంఛార్జ్ ఎంపిడివో సత్యన్నారాయణ, తహశీల్దారు కె విజయకుమార్, డిప్యూటి డిఈవో పి.అప్పారావు నాయకులు గుర్రం రామకృష్ణ, నల్లపరాజు వెంకటరాజు పాల్గొన్నారు.

రోడ్డు సౌకర్యం కల్పించాలని..

పివిటిజి గిరిజనుల నిరసన

ప్రజాశక్తి -రోలుగుంట: మండలంలోని ఎంకె.పట్నం పంచాయతీ శివారు కొరుప్రోలు గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించాలని పివిటిజి కొందు ఆదివాసీ గిరిజనులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె.గోవిందరావు మాట్లాడుతూ, గ్రామంలో 10 పది కుటుంబాలు 50 మంది జనాభా ఉన్నారన్నారు. కొండ పక్కనే జీవిస్తూ ఉన్నారని, వీరితో పాటు కోతులుపాలెం గ్రామం ఎస్టి కొండదొరకు చెందిన 30 కుటుంబాలు. ఎంకె.పట్నం 40 కుటుంబాల దళితులు కొరుప్రోలు గ్రామం వెనుక వీరు భూములు ఉన్నాయన్నారు. రోడ్డు సౌకర్యం లేక పోవడంతో గెడ్డలు దాటుకుంటూ ప్రయాణం చేస్తున్నారని చెప్పారు. కొరుప్రోలు గ్రామం నుండి ఎంకే.పట్నం గ్రామానికి వెళ్లాలంటే మూడు కిలోమీటర్లు గెడ్డలో నడుచుకుంటూ వెళ్లాల్సి వస్తుందన్నారు. ఊరు చుట్టూ గెడ్డలు ప్రవహిస్తుండటంతో నిత్యావసర వస్తువులు తెచ్చుకోవడానికి ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. రోడ్డు సౌకర్యాలు లేక పోవడంతో పలు పత్రికల్లో కథనాలు రావడంతో పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులు రోడ్డు ఏర్పాటు కోసం సర్వే చేశారని, రోడ్డు క్లియరెన్స్ కోసం, జంగిల్ క్లియరెన్స్ చేయడం జరిగిందన్నారు. రోడ్డు నిర్మాణం చేయడం కోసం కోటి 50లక్షలు ఉపాధి హామీ పథకం ద్వారా మెటీరియల్ కాంపినేట్ నిధుల నుండి ఎస్టిమేషన్ వేసి పంపించడం జరిగిందన్నారు. పంచాయతీరాజ్ (ప్రాజెక్ట్) డిప్యూటీ ఇంజనీర్, అసిస్టెంట్ ఇంజనీర్ మరొకసారి ఎస్టిమేషన్‌కి వచ్చారన్నారు. ఇప్పటికే మొదట ఎటిమేషన్ వేసి నెల 20 రోజులు గడుస్తుందన్నారు. 2018 నుండి ఇంజనీరింగ్ అధికారులు ఎస్టిమేట్లు వేస్తున్నారు తప్ప రోడ్లకి నిధులు మంజూరు చేయడం లేదని విమర్శించారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ గారు జోక్యం చేసుకొని ఉపాధి హామీ పథకం ద్వారా మెటీరియల్ కాంప్లిమెంట్ నిధుల నుండి ఎస్టిమేషన్ పంపించిన వాటికి రోడ్లు నిధులు మంజూరు చేసి గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించాలని కోరారు. లేకుంటే ఈ నెల 30న జిల్లా కలెక్టర్ కార్యాలయానికి డోలి యాత్ర నిర్వహిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పిటిజి సంఘం నాయకులు సుబ్బారావు, కొర్ర ఆనంద్, మండల కార్యదర్శి జీ.వాసు తదితరులు పాల్గొన్నారు.

నినాదాలు చేస్తున్న గిరిజనులు

గొలుగొండ గ్రంథాలయంలో చదువుతున్న విద్యార్థులు

గ్రంథాలయాల్లో 'చదవడం మా కిష్టం'

ప్రజాశక్తి-గొలుగొండ: గొలుగొండ శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి రాజుబాబు ఆధ్వర్యంలో చదవడం మాకు ఇష్టం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులచే బుక్ రీడింగ్, స్టోరీ టెల్లింగ్‌పై అవగాహన కల్పించారు. విద్యార్థులు గ్రంథాలయాలకు రావడం అలవాటు చేసుకోవాలన్నారు.

నర్సీపట్నం టౌన్: స్థానిక శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి దమయంతి ఆధ్వర్యంలో చదవడం మాకిష్టం కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పిల్లల చేత నీతి కథలు చదివించి అందులో నీతిని వివరించారు. విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయుడు ప్రభాకర్ మాట్లాడుతూ అంతర్జాతీయ నదుల దినోత్సవం ప్రాముఖ్యతను వివరించారు. చివర్లో పిల్లలతో ఒక రిక్రియేషన్ గేమ్ ఆడించి కార్యక్రమం ముగించారు.

కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

కొత్తకోటలో వైద్య శిబిరం

ప్రజాశక్తి -కొత్తకోట: రావికమతం మండలం కొత్తకోట గ్రామం లో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతమైంది.. కొత్తకోట న్యూ వాసవి క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక కేదారి శెట్టి రమేష్ ఇంటి ఆవరణలో నిర్వహించిన ఈ శిబిరంలో సుమారు 104 మంది కంటి వైద్య పరీక్షలు చేయగా అందులో సుమారు 58 మందికి ఆపరేషన్ అవసరమని గుర్తించారు. వీరిని విశాఖ శంకర్ పౌండషన్ కంటి వైద్య శాల కు తరలించారు. రోగులకు వాసవి క్లబ్ సభ్యులు ఉచిత భోజనం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో శంకర్ ఫౌండేషన్ ఆప్తలమిక్ ఆఫీసర్ జాన్, క్యాంపు మేనేజరు అరుణ్ కుమార్, సహాయ సిబ్బంది, వాసవీ క్లబ్ ప్రెసిడెంట్ కె.రమేష్, సెక్రటరీ కె.నరేంద్ర, ట్రెజరీ పి.అశోక్, వైస్ ప్రెసిడెంట్ కె.రామారావు పాల్గొన్నారు...

ఇసుక లారీ, ట్రాక్టర్ సీజ్

ప్రజాశక్తి-నక్కపల్లి: మండలంలోని ఇసుక అక్రమంగా రవాణా చేస్తున్న ట్రాక్టర్, లారీని సీజ్ చేసి జరిమానా విధించినట్లు సీఐ కుమారస్వామి, ఎస్ఐ సన్ని బాబు తెలిపారు. డిఎల్ పురం శివారు ప్రాంతంలో ట్రాక్టర్‌తో అక్రమంగా ఇసుక రవాణా చేస్తుండగా ఎస్ఐ సన్ని బాబు సిబ్బందితో కలిసి ట్రాక్టర్‌ను సీజ్ చేశారు. అదేవిధంగా రాజమండ్రి, రామేశ్వరంపేట నుంచి లారీపై ఇసుక అక్రమంగా రవాణా చేస్తుండగా ఉపమాక జంక్షన్ వద్ద పట్టుకుని సీజ్ చేశారు. రెండు వాహనాలను సీజ్ చేసి, జరిమానా విధించినట్లు వెల్లడించారు. ఇసుక అక్రమంగా రవాణా చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

పట్టుబడిన ట్రాక్టర్

రాష్ట్ర స్థాయి జూడో పోటీలకు చంద్రమౌళి ఎంపిక

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: నర్సీపట్నం మండలం గబ్బాడ హైస్కూల్లో పదో తరగతి చదువుతున్న పెట్ల చంద్రమౌళి రాష్ట్ర స్థాయి జూడో పోటీలకు ఎంపికయ్యాడు. ఇటీవల అనకాపల్లిలో జరిగిన స్కూల్ గేమ్ ఫెడరేషన్ పోటీలలో ప్రథమ స్థానం సాదించి రాష్ట్ర పోటీలకు అర్హత సాధించాడు. తిరుపతిలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో చంద్రమౌళి పాల్గొంటాడని పీడీ నాగేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా హెచ్ఎం సత్యనారాయణ (కిట్టు మాస్టర్), ఉపాధ్యాయులు విద్యార్థిని అభినందించారు.

పంపిణీ చేస్తున్న సర్పంచ్, ఎంపీటీసీ

డస్ట్ బిన్‌ల పంపిణీ

ప్రజాశక్తి-నక్కపల్లి: మండలంలోని పెదతీనార్ల గ్రామంలో ఆదివారం సర్పంచ్ శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యులు నాగేశ్వరరావు చేతుల మీదగా గ్రామ ప్రజలకు డస్ట్ బిన్ లు పంపిణీ చేసారు. తడి, పొడి చెత్తను వేరు వేరుగా డస్ట్ బిన్ లలో వెయ్యాలని సూచించారు. పారిశుధ్య కార్మికులతో ప్రతి ఇంటి వద్ద చెత్తను సేకరించడం జరుగుతుందన్నారు. చెత్తను ఎక్కడపడితే అక్కడ వెయ్యరాదని, అందరూ పరిశుభ్రత పాటించాలని సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తాతారావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై కూరుకు పోయిన లారీ

బురదమయంగా బిఎన్ రోడ్డు

-కూరుకుపోతున్న వాహనాలు

ప్రజాశక్తి -కొత్తకోట:కొత్తకోట బిఎన్ రోడ్డు లో ఇటీవల కురిసిన వర్షాలకు పలు వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ బిఎన్ రోడ్డు గత కొంత కాలంగా గోతులుగా మారింది. ఈ నేపథ్యంలో చిన్నపాటి వర్షాలకు గోతులలో మురుగు నీరు చేరి వాహనాలు కూరుకు పోతున్నాయి. ఆదివారం కొత్తకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమీపంలో వడ్డాది నుంచి నర్సీపట్నం వెళ్తున్న లారీ లోడ్‌తో దిగబడింది. ఈ లారీ ని బయటకు తీసేందుకు లారీ డ్రైవర్ నానా అవస్థలు పడ్డారు. ఈ రోడ్డుకు గత కొంత కాలంగా కనీస మరమ్మత్తులు చేపట్టక పోవడం తో వాహనాలు మట్టిలో కూరుకుపోతున్నాయి. సంబందించిన అధికారులు పట్టించు కోక పోవడంతో వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. రాత్రి సమయం లో వాహనాలు అదుపు తప్పి ప్రమాదాలు చేసుకుం టున్నాయి. తారు రోడ్డు కాస్త మట్టి రోడ్డుగా మారడం తో వర్షం పడినప్పుడల్లా బురదగా మారి వాహనదా రులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు సమస్యను పరిష్కరించాలని పలువురు వాహనదారులు కోరుతున్నారు,

రాష్ట్ర స్థాయి జూడో పోటీలకు చంద్రమౌళి ఎంపిక

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:నర్సీపట్నం మండలం గబ్బాడ హైస్కూల్లో పదో తరగతి చదువుతున్న పెట్ల చంద్రమౌళి రాష్ట్ర స్థాయి జూడో పోటీలకు ఎంపికయ్యాడు. ఇటీవల అనకాపల్లిలో జరిగిన స్కూల్ గేమ్ ఫెడరేషన్ పోటీలలో ప్రథమ స్థానం సాదించి రాష్ట్ర పోటీలకు అర్హత సాధించాడు. తిరుపతిలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో చంద్రమౌళి పాల్గొంటాడని పీడీ నాగేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా హెచ్ఎం సత్యనారాయణ (కిట్టు మాస్టర్) అభినందించారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న వెంకటరెడ్డి, తదితరులు

మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం రూ.28,728 చెల్లించాలని జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటి యు) గౌరవా ధ్యక్షులు పి. వెంకటరెడ్డి డిమాండ్ చేశారు. ఈ డిమాండ్ సాధన కోసం ఈనెల 30వ తేదీన జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద చేపట్టే మహా ధర్నాను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. మహా ధర్నాకు సంబంధించిన పోస్టర్‌ను ఆదివారం జగదాంబ సిఐటియు కార్యాలయంలో యూనియన్ నాయకులతో కలిపి ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పెరిగిన ధరలకు అనుగుణంగా, గౌరవ ప్రదమైన వేతనాలు నిర్ణయించాలని డిమాండ్‌చేశారు. గతంలో ఎన్ఎంఆర్, డైలీ వేజ్, పార్ట్ టైం, కంటిజెంట్, క్యాజువల్ అని ఏ పేరుతో పిలిచినా ఐదేళ్లు పూర్తయితే పర్మినెంట్ చేసేవారని,దోపిడీ సరళీకరణ విధానాలు వచ్చాక యజమానులే నేరుగా చట్టసభలైన అసెంబ్లీ, పార్లమెంటులకు ప్రతినిధులుగా వెళ్లడం వలన చట్టాలను మార్చేసి, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ విధానాన్ని ప్రవేశపెట్టారన్నారు. కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని 30వ తేదీన దేశవ్యాప్తంగా నిరసన ప్రదర్శనలు చేయాలని సిఐటియు పిలుపునిచ్చిందని చెప్పారు. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి యు.రాజు, ఉపాధ్యక్షుడు శీర రమణ, నాయుడు, కె.వెంకట్రావు, శ్రావణ్ పాల్గొన్నారు.

అడ్డూ, అదుపు లేకుండా.. ఇసుక అక్రమ రవాణా

-ఎపిఐఐసి భూముల్లో తవ్వకాలు- కొరవడిన అధికారుల పర్యవేక్షణ

అమలాపురం, మూలపర్ర వద్ద ఇసుక తవ్వకాల ప్రదేశం

ప్రజాశక్తి-నక్కపల్లి:మండలంలోని తీర ప్రాంతాల్లో ఇసుక బకాసురులు ఇసుకను బొక్కేస్తున్నారు. గత కొన్నేళ్లు గా అడ్డు అదుపు లేకుండా ఇసుక అక్రమ రవాణా జరుగుతుంది. ఇలా ఉంటే కొన్నేళ్లకు తీర ప్రాంతంలో ఇసుక కనుమరుగయ్యే పరిస్థితి ఏర్పడనుంది.

ముఖ్యంగా అమలాపురం పంచాయతీ పరిధిలో వైజాగ్ - చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్‌లో భాగంగా ఏపీఐఐసీ అధికారులు సేకరించిన భూముల్లో ఇసుక అక్రమ తవ్వకాలు గత కొంతకాలం నుంచి జోరుగా సాగుతోంది. జెసిబి సహాయంతో లారీలు, టిప్పర్లు, ట్రాక్టర్లతో ఇసుక బకాసురులు అక్రమంగా ఇసుక తవ్వకాలు చేపట్టి ఇసుకను దోచేస్తున్నారు. ముఖ్యంగా రాత్రి వేళలో ఇసుక అక్రమ తవ్వకాలు జోరందుకుంటున్నాయి. అమలాపురం పంచాయతీ పరిధిలో తీర ప్రాంతంలో ఇసుక తవ్వకాలు చేపట్టి మూలపర్ర ప్రాంతంలో ఇసుక స్టాక్ చేసుకుని అక్కడి నుంచి తరలిస్తున్నారు.

మూలపర్ర వద్ద ఇసుక స్టాక్ పాయింట్

ఏపీఐఐసీ భూముల్లో ఇసుక బకాసురులు బరితెగించి ఇసుకను దోచేస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడం స్థానికంగా చర్చనీయమైంది. అమలాపురం, డిఎల్ పురం, గునుపూడి తీర ప్రాంతంలో దోచేసిన ఇసుకను అనకాపల్లి, అచ్యుతాపురం ప్రాంతాలకు టిప్పర్లు, లారీల పై తరలించి పెద్ద వ్యాపారమే సాగిస్తున్నారు.

అధికారుల పర్యవేక్షణ కొరవడంతో ఇసుక బకాసురులు బరితెగించి ఇష్టానుసారంగా యధేచ్చగా ఇసుక అక్రమంగా రవాణా చేస్తున్నారు. ఇటీవల సీఐ కుమారస్వామి, ఎస్ఐ సన్నిబాబు ల నేతృత్వంలో ఇసుక అక్రమ రవాణాకు కళ్లెం వేసేందుకు ప్రత్యేక నిఘా పెట్టారు. ఇసుక తవ్వకాలపై ఉక్కు పాదం మోపారు. ముందస్తు సమాచారం మేరకు ఆగస్టు 24 వ తేదీన వేంపాడు జంక్షన్ వద్ద అక్రమంగా ఇసుక తరలిస్తున్న 2 టిప్పర్లను, 28న డి ఎల్ పురం ప్రాంతంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న 2 టిప్పర్లు, జెసిబి ని, ఈనెల 17వ తేదీన డి.ఎల్.పురం ప్రాంతంలో 2 ట్రాక్టర్లు,ఉ పమాక జంక్షన్ వద్ద ఒక లారీని సీజ్ చేసి, జరిమానా విధించారు.అయినప్పటికీ ఇసుక మాఫియాలో ఎటువంటి మార్పు రాలేదు. ఫైన్ చెల్లించి ,యధావిధిగా ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారు. నది ఇసుకలో సముద్రపు ఇసుక కలిపి అక్రమ వ్యాపారాలు సాగిస్తున్నారు. తీర ప్రాంతంలో పెద్ద వ్యాపారమే సాగుతుంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణాను అడ్డుకోవాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలి

అమలాపురం ప్రాంతంలో అక్రమ ఇసుక తవ్వకాలను, రవాణాను అరికట్టాలి. సుమారుగా 10 సంవత్సరాల నుండి యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా జరుగుతుంది. ఏపీఐఐసీ సేకరించిన భూముల్లో ఇసుక బకాసురులు అడ్డు అదుపు లేకుండా ఇసుక అక్రమంగా దోచేస్తున్నారు. అధికారులు పట్టించు కోకపోవడంతో ఇసుక మాఫియా ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. అక్రమంగా రవాణా చేసి లక్షలాది రూపాయలు దోచుకుంటున్నారు.

ఏరిపల్లి సత్తిబాబు, అమలాపురం

ఇసుకను అక్రమంగా తరలిస్తే ఉపేక్షించం

ఇసుక అక్రమ రవాణా అరికట్టేందుకు చర్యలు చేపట్టాం. ఇప్పటికే ఇసుక మాఫియా పై ఉక్కు పాదం మోపాం. ఎస్ఐ సన్నిబాబు, సిబ్బందితో ప్రత్యేక నిఘా పెట్టాం. ఇసుక అక్రమంగా తరలిస్తున్న వాహనాలు సీజ్ చేసి, జరిమానా కూడా విధించడం జరిగింది. ఇసుక అక్రమంగా తరలిస్తే ఉపేక్షించేది లేదు. వాహనాలు సీజ్ చేసి, జరిమానా విధిస్తాం.

కె.కుమారస్వామి, సిఐ

లండన్ ఐవిఎఫ్ సెంటర్ వార్షికోత్సవ సంబరాలు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : జిల్లా పరిషత్ జంక్షన్‌లో ఉన్న లండన్ ఐవిఎఫ్ సెంటర్ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. సంతానోత్పత్తి సంరక్షణ నిర్వహణలో పేరొందిన సంస్థగా గుర్తింపు పొందిన ఈ సెంటర్ ద్వారా అందించిన చికిత్సలతో సంతానం పొందిన తల్లితండ్రులు వారి నవజాత శిశువులు నుంచి 8 సంవత్సరాల వయసున్న వారి పిల్లలను తీసుకుని హాజరై తమ ఆనందానుభుతులను వ్యక్తపరిచారు. ఈ సందర్భంగా నిర్వహించిన బేబీ ఫ్యాషన్ షో వేడుకలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. వేడుకలు సందర్భంగా పునరుత్పత్తి ఆరోగ్య నిపుణులు, గైనకాలజిస్ట్ డాక్టర్ చంద్రారెడ్డి మాట్లాడుతూ, ఐవిఎఫ్ చికిత్సలకు సంబంధించిన అపోహలు, అనుమానాలు గురించి, చికిత్స గురించిన వాస్తవాలను వివరించారు. ఐవిఎఫ్ చికిత్స చాల ఖర్చుతో కూడిన పని అని, చికిత్స ద్వారా పుట్టిన పిల్లలు సక్రమంగా ఉండరనే అంశాలను ఆయన తోసిపుచ్చారు. తమ లండన్ ఐవిఎఫ్ సెంటర్‌లో అత్యంత సరసమైన ధరలకే అత్యుత్తమ చికిత్సలు అందిస్తున్నామని, తమ చికిత్సల ద్వారా జన్మించిన పిల్లలు మానసికంగా, శారీరకంగా ఆరోగ్యవంతులుగా పెరుగుతున్నారని తెలిపారు. విశాఖలో ప్రారంభమైన తర్వాత తమ సెంటర్ సంతానోత్పత్తి చికిత్సల సేవలను విజయనగరం, రాజమండ్రి, కాకినాడ, పాయకరావుపేట ప్రాంతాలకు విస్తరిస్తున్నట్లు చెప్పారు. తమ సెంటర్ ప్రపంచ స్థాయి అన్ని సదుపాయములు, నిపుణులైన డాక్టర్ల బృందం కలిగి ఉందన్నారు. అత్యాధునిక సదుపాయాలతో ఎగ్ డోనర్ చికిత్సతోపాటు సరోగసీ సేవలను అందిస్తున్నట్లు తెలిపారు. తమ సెంటర్ వార్షికోత్సవం సందర్భంగా అన్ని మందుల ఖర్చులతో సహా పేదవర్గానికి చెందిన 5 జంటలకు చికిత్సలో, 50శాతం తగ్గింపుతో మరో 5 జంటలకు చికిత్సను అందించాలని సంకల్పించామని తెలిపారు. డాక్టర్ చంద్రారెడ్డి, డాక్టర్ అనన్యతోపాటు గౌరవ అతిథిగా పాల్గొన్న డాక్టర్ టిఆర్.ధనలత లండన్ ఐవిఎఫ్ క్రానికల్స్, త్రైమాసిక మ్యాగజైన్‌ను ఆవిష్కరించారు. వేడుకలలో ప్రముఖ వైద్యులు డాక్టర్ మాధవీలత, డాక్టర్ ఎన్.భూలక్ష్మి, డాక్టర్ జి.తనూజ, డాక్టర్ మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వార్షికోత్సవ ఆఫర్ల కూపన్లను అందిస్తున్న ప్రతినిధులు

నార్త్ ఆంధ్ర గ్యాస్ట్రో ఇనిస్టిట్యూట్ ప్రారంభం

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ఉత్తరాంధ్ర ప్రజలకు ఉత్తమ వైద్య సేవలందించాలనే లక్ష్యంతో విశాఖలో డాక్టర్ మోహన్ వంశీ ఆధ్వర్యాన నార్త్ ఆంధ్ర గ్యాస్ట్రో ఇనిస్టిట్యూట్‌ను (నాగీ) ఆదివారం జిల్లాపరిషత్ జంక్షన్, కృష్ణమందిరం సమీపంలో ప్రారంభించారు. ఈ నాగి ఇనిస్టిట్యూట్ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిధిగా పద్మభూషణ్ డాక్టర్ డి.నాగేశ్వర్‌రెడ్డి (వ్యవస్థాపకులు, చైర్మన్, ఏషియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రో ఎంటరాలజీ, హైదరాబాద్) పాల్గొని మాట్లాడారు. విశాఖలో తన శిష్యుడు గ్యాస్ట్రో ఇనిస్టిట్యూట్ ఏర్పాటుచేయటం ఎంతో సంతోషం అన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించాలనన్నారు. అధునాతన యంత్రాలతో మెరుగైన వైద్యం అందిస్తారని, విశాఖ ప్రజలు అందరూ ఉపయోగించుకోవాలని కోరారు. నాగి ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ డాక్టర్ మోహన్‌వంశీ మాట్లాడుతూ క్షణం తీరిక లేకుండా బిజీగా ఉండే డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి తమ హాస్పిటల్ ప్రారంభోత్సవానికి రావటం చాలా సంతోషంగా ఉందని, ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ గ్యాస్ట్రో ఇనిస్టిట్యూట్‌లో గ్యాస్ట్రో ఎంటరాలజీ వైద్య సేవలకు సంబంధించిన అన్ని ఆధునిక పరికరాలు డయాగ్నస్టిక్, థెరపీటిక్, ఎండోస్కోపీ, కోలోనోస్కోపీ, పిడియాట్రిక్ ఎండోస్కోపీ ఉందని తెలిపారు. జీర్ణకోశ సంబంధిత అన్ని రకాల వ్యాధులకు అత్యాధునిక చికిత్సలు ఇక్కడ అందుబాటులో ఉంటాయన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



నార్త్ ఆంధ్ర గ్యాస్ట్రో ఇనిస్టిట్యూట్ ప్రారంభంలో డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి